యురేనియం - 235

కె. శివరామ్

భుజంగరావు తన కారులో ఎస్టేట్ వైపు వెళ్ళుతున్నాడు. నలభై ఏళ్ళవాడు. దృఢమైన శరీరం గలవాడు. స్ఫురద్రూపి. మెరిసే కళ్ళు.

భుజంగరావు అతి ఉత్సాహంగా కారు నడుపుతున్నాడు. అతని మనసు సంతోషంతో గంతులేస్తూంది.

భుజంగరావుకు మాతృదేశమంటే అలవిమాలిన భక్తి. ఏదో ఒకటి దేశసేవ చేయాలని ఉవ్విళ్ళూరుతూంటాడు.

'ప్రభుత్వం నీకేం చేస్తున్నది అని అడగడానికి ముందు నువ్వు ప్రభుత్వానికి ఏం చేస్తున్నావో ఆలోచించుకో' అన్న స్వర్గీయ కెన్నెడీ మాటలను భుజంగరావుకి పదేపదే మననం

చేసుకోవడం అలవాటు.

ప్రతివ్యక్తీ ప్రభుత్వానికి అండగావుంటే దేశం సుభిక్షంగా వుంటుంది, అను సిద్ధాంతం కలవాడు భుజంగరావు. తనకు రెండు ఎస్టేట్లున్నవి. సాలీనా ఆదాయం కొన్ని లక్షలకు దాటుతుంది.

పెద్దలు సంపాదించిన ఆస్తిపాస్తులున్నై. వాటితో తను దేశానికి వుపయోగపడు కార్యం ఏదైనా చేయాలని భుజంగ రావుకు చిరకాల వాంఛ.

తన వాంఛను నెరవేర్చుకోడానికి భూగర్భశాస్త్రాన్ని, అణుశాస్త్రాన్ని క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. దేశదేశాలు తిరిగాడు. కొన్ని కోట్లరూపాయలు ఖర్చుపెట్టాడు. రేయింబవళ్లు శ్రమిస్తున్నాడు.

తన కోర్కె ఈ దేసకాలం ఆసన్నమైపోయింది.

అందుకే భుజంగరావుకు అంత వుత్సాహంగావుంది.

భుజంగరావు కారు ఎస్టేట్ లో ఒక రహస్య ప్రదేశంలో తిరిగింది. కొంతదూరం చెట్ల మధ్యగుండా కారు ప్రయాణించింది.

ఎదురుగా —

న్యూక్లియర్ చెయిన్ రియాక్టింగ్ పైల్ వుంది. అంటే అణుబాంబుల ఉత్పత్తి నిలయం!!

భుజంగరావు కారు దిగగానే అక్కడున్న వైజ్ఞానికు లందరూ విష్ చేశారు. అక్కడున్న వారందరి ముఖాల్లోను ఆనందోత్సాహాలు వుట్టిపడుతున్నై. కరచాలనం ముగిసింది. భుజంగరావును లోపలకు తీసుకెళ్లారు.

అక్కడ "ఫిషన్-ఫ్యూషన్-ఫిషన్" బాంబు వున్నది. ఆ బాంబును తయారుచేసిన శాస్త్రజ్ఞులందరూ గర్వంతో నిలబడి వున్నారు. ఆ బాంబు యిప్పటికి తెల్సిన బాంబు లన్నిటిలో కెల్లా అధిక విధ్వంసక శక్తిగలది. దాని శక్తి

అపారమైనది.

అంతేగాక రకరకాల భయంకరమైన బాంబులువుత్పత్తి అయివున్నవి. ఫిషన్ ద్వారా ప్రేలే ఆటంబాంబులు, ఫ్యూషన్ ద్వారా ప్రేలే హైడ్రోజన్ బాంబులు అతి జాగ్రత్తగా భద్రపరచబడి వున్నవి.

అక్కడున్న సైంటిస్టులందరూ దేశదేశాలకు చెందినవారు. జర్మన్లు, అమెరికన్లు, ఇజ్రాయిల్ వారు, రష్యన్లు, గొప్ప గొప్ప విజ్ఞానులు. వాళ్ళందరినీ భుజంగరావే ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి పిల్చుకువచ్చి బాంబులను తయారు చేయించాడు.

భుజంగరావుకి భూగర్భశాస్త్రంలో ప్రవేశంవుంది గనక తన ఎస్టేటులో ఒకచోట యురేనియం లభ్యమవుతుందని పసిగట్టాడు. వెంటనే వెలికి తీయించి పరిశోధించాడు. సహజమైన యురేనియం సమృద్ధిగా లభ్యంకావడం తెల్సుకున్నాడు. అతని మెదడులో రకరకాల ఆలోచనలు మెదిలాయి.

మన ప్రభుత్వాన్ని అణుబాంబులను తయారు చేయడానికి లైసెన్సు యివ్వవలసినదిగా కోరాడు. శాంతిని ఆకాంక్షించు మన భారత ప్రభుత్వం లైసెన్సు యివ్వ నిరాకరించింది.

అందుకు భుజంగరావు విచారించలేదు. అమెరికా, జర్మనీలకు వెళ్ళాడు. అక్కడున్న ప్రయివేట్ వైజ్ఞానికులతో సంప్రతించాడు. రహస్యంగానూ, మర్మంగానూ చాలా మంది శాస్త్రజ్ఞులను తన ఎస్టేటుకు రప్పించాడు. బాంబులను తయారుచేయడం ప్రారంభించాడు.

ఆ బాంబులన్నింటిని యేం చేస్తాడో, ఏంచేసుకుంటాడో ఎవరికీ అంతుపట్టలేదు. ప్రపంచంలో ఏ ఒక వ్యక్తి స్వంతముగా న్యూక్లియర్ రియాక్టర్లను నిర్మించడం అసంభవం

అయినపని!

కానీ భుజంగరావు నిర్మించుకున్నాడు. పైగా తను అనుకున్న ప్రకారం బాంబులను తయారు చేయించాడు. నిల్వ చేశాడు.

పరమాణు యుగంలో ఉత్పత్తి అయిన పదిలక్షల టన్నుల ప్రేలుడు మందుకు సమమైన అణుబాంబులాటి మెగాటన్ను బాంబుకంటె ప్రముఖ పదార్థం రేడియో ఐసోటోపు. ఈ ఐసోటోపు న్యూక్లియర్ రియాక్టర్ల సాయంతో విరివిగా ఉత్పత్తి చేయొచ్చు. ఈ రియాక్టర్ భుజంగరావు ఎస్టేటులో వుంది.

అక్కడవున్న బాంబులన్నిటిని శాస్త్రజ్ఞులు భుజంగరావుకు విడమర్చి చెప్పారు. ఆ తరువాత భుజంగరావును ఆటంబాంబులను తయారుచేయు ఫిషన్ విభాగానికిపిలుచుకు వెళ్ళారు. విచ్ఛిన్నం చేసే ప్రక్రియను ఫిషన్ అంటారు. ఈ ఫిషన్ ద్వారానే ఆటంబాంబులు ప్రేలుతాయి.

సహజమైన యురేనియం తాలూకు 140 పాళ్ళల్లో ఒక్క పాలే యురేనియం_235.

మిగతా 139 పాళ్ళు యురేనియం_238 ఐసోటోపు.

స్వచ్ఛమైన, అసలైన సిసలైనది యురేనియం_235. దీనిని పేర్చుకుంటూ రావాలి. 8 లేక 9 అంగుళాల వ్యాసం వచ్చేంతవరకు పేర్చుకుంటూ వస్తే ప్రేలిపోతుంది. దీనినే ఎ_బాంబు అంటారు. యు_238 ఖండనకు గురికాదు.

యురేనియం_235 ఉండ ఒక పరిమాణానికి తక్కువగా వున్నట్టయితే ప్రేలుడు జరగదు. యురేనియాన్ని యెలా పేర్చుతారో భుజంగరావుకు తెలియదు. ఆ విషయం శాస్త్రజ్ఞులకే తెల్సు.

ఒక్క అణుబాంబు తయారుకావడానికి 16 లక్షల రూపాయలు వ్యయమవుతుందని అంచనా. యురేనియం_235

వేరుపరచడమే కష్టతరమైనది. ఇప్పుడు అక్కడ తయారగు బాంబు మూడవది. రెండు తయారైపోయివున్నవి. మూడు హైడ్రోజన్ బాంబులు ఎప్పుడో తయారు చేసివున్నారు. మొత్తం ఆరు బాంబులు తయారు కావల్సివున్నది. అయిదు తయారైపోయాయి.

యురేనియం అవస్థ ప్రమాణం చేరుకుంటే న్యూట్రానుల సంఖ్య పెరిగి సెకండులో మిలియనో వంతు కాలవ్యవధిలో అసంఖ్యాకమైన ఖండనలు జరుగుతాయి. ప్రతి ఖండనకు Mev శక్తి ఉత్పత్తి అవుతుంది. ఫలితం ప్రచండమైన భయంకరమైన బాంబు.

సృష్టిలో యు-235 కు భగవంతుడు ఎందుకంత శక్తి ఇచ్చివున్నాడో ఆశ్చర్యం! అది తెల్సుకున్న మానవుడు ఇపుడు దేవుణ్ణీ లెక్క చేయడంలేదు. ఈ ఆటమ్‌ను క్రీస్తుకు పూర్వం 5 వ శతాబ్దంలోనే డెమోక్రిటస్ అనునతడు కనిపెట్టి పేరుపెట్టాడు. ఆటమ్ అంటే గ్రీకు భాషలో విభజింపరానిదని అర్థం! అంటే పరమాణువు!

చివరిబాంబు తయారైపోతూంది. శాస్త్రజ్ఞు లందరినీ వారివారి దేశాలకు తగిన రీతిని సత్కరించాడు భుజంగరావు.

యురేనియం-235 పేర్చుకు రావడమే కష్టం. అది జరిగిపోయింది. పేర్చిన తరువాత బాంబుగా అమర్చడం తేలిక. ఇక తనే బాంబును తయారు చేసుకోవచ్చు.

శాస్త్రజ్ఞు లందరికీ వీడ్కోలివ్వాలి. గనక అందరితో పాటు భుజంగరావు విమానాశ్రయానికి బయలుదేరాడు. బ్రాంట్‌తో భుజంగరావు ముచ్చటించుతున్నాడు. బ్రాంట్ కూడా చాలా ఉత్సాహంగా కబుర్లు చెప్పుకు పోతున్నాడు.

బ్రాంట్ తన జేబులో వుండిన డైరీ క్రిందకు జారిపోయిన సంగతి తెల్సుకోలేక పోయాడు. అతను కూర్చుని వుండిన

సీటు మీదనుండి క్రిందకు జారిపోయింది. ఎవరూ గమనించ లేదు.

ఇంతలో విమానం బయలుదేర బోతుందని లౌడ్ స్పీకర్లో అనౌన్స్ వినబడగానే ఆదరాబాదరాగా విమానం వైపు బ్రాంట్ వెళ్ళిపోయాడు. క్రిందపడ్డ డైరీ నేలమీదనే పడి వుంది. ఆ డైరీ అప్రయత్నంగా ఒకతని దృష్టిలో పడింది.

2

"డియర్ హనీ! నా లక్ష్యం నెరవేరింది. ప్రపంచంలో ఏ దేశానికీ ఏ దేశభక్తుడూ చేయని మహత్కార్యం నేను మన దేశానికి చేశాను," అని ఉప్పొంగి పోయాడు భుజంగ రావు.

"ఏం చేశారేమిటి?" ప్రశ్నించింది దేవకి, భర్తను.

"దేశానికి శక్తిని పెంపొందించాను.బలాన్ని చేకూర్చాను. మాతృభూమికి అపారమైన, అఖండమైన ఎనర్జీని తయారు చేయించాను. నేటివ్ పవర్ని రక్షించుకోడానికి నేను తయారు చేసిన శక్తి మన దేశానికి యెంతో వుపకరిస్తుంది." అని భుజంగరావు గంతులేశాడు. అతనిలోని వుల్లాసం గమనించిన దేవకికి కారణం ఏమిటై వుంటుందో వూహకందలేదు.

"వివరంగా చెప్పండి" గోముగా అడిగింది దేవకి.

"చెప్తాను. నీకు చెప్పడానికి, చూపడానికే తెచ్చాను." అనంటూ భుజంగరావు రెండు వేరువేరు పెట్టెలను దేవకి ముందు బెడ్ మీద పెట్టాడు. ఆమె విచిత్రంగా ఆ పెట్టెలను చూచింది.ఆ పెట్టెలలో ఏముందో? ప్రశ్నార్థకంగా చూస్తూ వుండి పోయింది.

ఆనందంతో భుజంగరావు ఒక పెట్టెను తెరిచాడు. ఏదో లోహం తళతళ మెరిసిపోతూంది. అది ఏమిటో ఆమెకు తెలియరావడం లేదు.

"ఏమిటండి అది?" అడిగింది దేవకి.

"ఇదే యురేనియం_235!!"

"ఎందుకు?"

"ఎందుకేమిటి? ఇదే అణుబాంబు!!"

"మైగాడ్!అణుబాంబే... యు మీన్ ఆటమ్ బాంబ్?!"

"యస్. యస్." అన్నాడు భుజంగరావు.

ఆత్రంగా యురేనియం_235ని భర్త చేతిలో ఉన్నదాన్ని దేవకి తీసుకుంది. తిప్పి తిప్పి చూసింది. చాలా బరువుగా వుంది. కాసేపుకూడా చేతిలో పట్టుకోలేకపోయింది. బెడ్ మీదున్న పరుపు మీదుంచింది. ఆ యురేనియాన్ని విచిత్రంగా చూచింది దేవకి. అది యెలా ప్రేలుతుందో ఆమె కంతుపట్టలేదు.

"ఇది యెలా పేలుతుంది?" అడిగింది దేవకి.

"అది ఒక్కటే ప్రేలదు. మరో సగం ఈ పెట్టెలో వుంది" అనంటూ భుజంగరావు ఇంకో పెట్టెనూ తెచ్చాడు. అందులో వేరే సగం యురేనియం_235 వుంది.

"ఈ రెండు యురేనియం ముద్దలు కల్సుకుంటే చాలు భయంకరమైన ప్రేలుడు సంభవిస్తుంది" అని చెప్పాడు భుజంగరావు.

భార్యాభర్తలవద్ద రెండు యురేనియం ముద్దలున్నవి. ఆ రెండూ కొబ్బరిచిప్పల ఆకారంలో వున్నవి. రెండూ కలిపితే తొమ్మిది అంగుళాల వ్యాసంవుంటుంది.రమారమి బాస్కెట్ బాల్ అంత వుంటుంది.

"ఈ రెండూ కలిపితే ప్రేలుతుందంటున్నారు కదా! ప్రయోగించే దెలా?" అడిగింది దేవకి.

"ఈ రెంటినీ కలపడమే!" చెప్పాడు భుజంగరావు.

"ఇంతటి భయంకరమైన బాంబును యింటికి ఎందుకు తెచ్చారు?"

"నీకు చూపాలని తెచ్చాను. అణుబాంబునుగూర్చి నీకు చెప్పాలని తెచ్చాను" అన్నాడు భుజంగరావు. అతనికి భార్యమీద ఎంత అనురాగం, ప్రేమ వుందో దేవకి అర్థం చేసుకో కలిగింది.

"పొరబాటున యెవరైనా ఈ యురేనియం ముద్దలు కలిపితే ఏమవుతుంది? ఈ నగరమే కాదు...చుట్టు ప్రక్కల ప్రదేశాలన్నీ భస్మీపటలమైపోతాయి. ముందు తీసుకెళ్ళండి" అని దేవకి భయాన్ని వ్యక్తపఱచింది.

భుజంగరావు నవ్వాడు.

"అణుబాంబు ప్రయోగం మూలంగా యెంతటి విధ్వంసం సంభవిస్తుందో లోకమెరిగిన సత్యం! అందుకే అణుబాంబులు గల దేశాలు అగ్రరాజ్యాలని, శక్తివంతమైనవని గణన కెక్కుతున్నవి."

"ఒక దేశానికి ఉండవల్సిన అణుబాంబు మన వద్ద ఎందుకు?"

"మన దేశంలో అణుబాంబుల్లేవు. అణుబాంబులు తయారు చేయడానికి సకల సదుపాయాలు ఉన్నవి. కానీ తయారు చేయడంలేదు. మనదేశం వద్ద అణుబాంబులు లేవు గనక కొన్ని శత్రు దేశాలు పొంచి వున్నవి. యుద్ధానికి ఆయత్తమవుతున్నవి. ఈ రోజుల్లో అణ్వస్త్రాలు లేని దేశం బలహీనమైనదని, సాంకేతిక రంగంలో వెనుక బడిందని, పేద దేశమని రకరకాలుగా హేళనకు గురవుతూంది."

"అందుకని?"

"అణ్వస్త్రాలు తయారు చేశాను. దేశానికి శక్తిని, సామర్థ్యాన్ని యినుమడింప జేశాను" గర్వంతో అన్నాడు భుజంగరావు.

"మనదేశం శాంతిని ఆకాంక్షించటంలో పేరు మోసింది. అందుకే అణ్వాయుధాలు ఉత్పత్తి ప్రారంభించలేదు"

చెప్పింది దేవకి.

"శాంతిని పలికే దేశాలన్నో ప్రపంచంలో అణ్వాయుధాలను సిద్ధంగా వుంచుకుని ఉన్నవి. మనదేశానికి ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా అణ్వాస్త్రాలు అత్యావసరమైనవి. అత్యావసరమైన అణు బాంబులను తయారు చేసుకొనడానికి సదుపాయాలన్నీ వుండీ కొందరు నాయకులు రాజకీయాల పేరుతో, పదవీ వ్యామోహంతో, కీర్తిదాహంతో అణ్వాస్త్రాలను తయారు చేయక శత్రుదేశాల దృష్టిలో బలహీనమైనదిగా భారత దేశాన్ని చిత్రిస్తున్నారు" అంటూ భుజంగరావు బాధపడిపోయాడు.

"ఆ గొడవ మనకెందు కంట?" అన్నది దేవకి.

"మనకు కాకపోతే మరెవరికి! మనది ప్రజాస్వామ్యం. కమ్యూనిస్టు రాజ్యాలలో లాగా యంత్రాల్లాటి పౌరులం కాము. ప్రతి వ్యక్తీ తన ప్రభుత్వాన్ని తీర్చి దిద్దుకోడానికి హక్కుగల్గి వున్న దేశం మనది. గనక ప్రతిపౌరునికీ బాధ్యత ఉంది" అని చెప్పాడు భుజంగరావు.

3

"మిస్టర్ జగదీష్! నువ్వు భుజంగరావు భార్య దేవకితో దొంగ తిరుగుళ్ళు తిరగడం మాకు తెల్సు. దేవకికి నీ వంటె అలవిమాలిన ప్రేమ. ఆమె వద్దనుండి కొన్ని రహస్యాలు తెల్సుకు రావాలి" చెప్పాడొకడు క్రూరంగా. రెండవవాడు జగదీష్ భార్య జలజను బంధించటంలో నిమగ్నమయ్యాడు.

"నా వల్ల కాదు," అన్నాడు జగదీశ్, ఆవేశంగా.

వెంటనే ఢాం, ఢాం అని పిస్తోలు ప్రేలింది. ఒక గుండు జగదీశ్ చెవువద్దనుండి గీc పెట్టుకుంటూ వెళ్ళింది. మరోగుండు జలజ చీర కుచ్చెళ్ళగుండా దూసుకువెళ్ళి గోడకు ఖంగుమని మ్రోగింది. గుడ్డకాలిన వాసన గుప్పున కొట్టింది.

"నీ భార్య బ్రతకాలంటే, నువ్వు జీవించాలంటే చేసి తీరాలి. తెల్సిగా... మేము రాక్షసులం. మేము ఇహపరాలలో వుండే మానవులకో, దేవుళ్ళకో భయపడం. భయం అనేది, ఓటమి అనేది మా జీవితాల్లో మేము ఎఱుగం" హుంకరించారు.

వాళ్ళ సాహసానికి, ధైర్యానికి జగదీశ్ గడగడ లాడిపోయాడు. పిస్తోలు ప్రేల్చడంలో అఖండులని యిట్టే తెలిసిపోయింది. అఱచి గొడవ చేద్దామనుకుంటె పిస్తోలుతో కాల్చేస్తారు. ఒకరికి ఇద్దరు దుండగులు అంబోతుల్లా నిలబడి వున్నారు.

తన బలం వారిముందు కాలిక్రింద చీమలావుంది. ఒప్పుకోవాలి. ఒప్పుకుని తీరాలి. వాళ్లెవరు? దేవకివద్ద రహస్యాలంటున్నారు. ఏమిటవి? ఎలా తెల్సుకోవాలి? తెల్సుకున్నంత మాత్రాన వాళ్లు వదిలిపెట్తారన్న నమ్మకం ఏమిటి? ఏమిటీ విషమ పరిస్థితి! దౌర్జన్యంగా తనింట్లో జొరబడి అధికారం చలాయిస్తున్నారు.

జగదీశ్ జీవచ్ఛవంలా నిలబడిపోయాడు.

"చెప్పండి ఏం తెల్సుకోవాలి?" అడిగాడు.

"చెప్తాం. చెప్పడానికి ముందు ఒక విషయం గుర్తుంచుకో. నిన్ను మేము అడిగినట్లు ఎవరికీ చెప్పకూడదు. అలా చెప్పావో ముల్లోకాల్లో ఎక్కడున్నా చిత్రవధ చేస్తాం."

"చెప్పను," అన్నాడు జగదీశ్ భయంగా. వాళ్ళ ఆకారాలు, మాటల దురుసుతనం వింటూంటే జగదీశ్ కు బ్రతుకుతామన్న ఆశ సన్నగిల్లుతూంది.

"అయితే విను. దేవకి భర్త భుజంగరావు ఎస్టేటులో రహస్యంగా న్యూక్లియర్ రియాక్టర్ ప్లైల్ వుంది. అందులో కొన్ని బాంబులను అతి రహస్యంగా, మర్మంగా. భద్రంగా

దాచి వుంచివున్నాడు. వాటిని ఎక్కడ ఏ విధంగా దాచి వున్నది దేవకికి చెప్పివుంటాడు. ఆమె వద్ద ఈ రహస్యాన్ని ఎలాగైనా తెల్సుకుని చెప్పాలి. పొరపాటు జరిగిందా నీ భార్య నీకు దక్కదు. అంతేకాదు నువ్వు దేవకితో కులికిన రాత్రులు, పగళ్లు భుజంగరావుకు తెలియజేయబడతాయి,” అని ఉరిమారు.

జగదీశ్ గడగడలాడిపోయాడు. బాంబులు అనగానే అతనికి వూపిరి ఆగిపోయింది. మోల్డింగ్ బొమ్మలా మోడు బారిపోయాడు. శరీరమంతా కంపించిపోయింది.

“నాకేదో భయంగా వుందండి,” నీళ్లు నమిలాడు జగదీశ్.

“ఆ రహస్యం తెల్సుకుని చెప్పావంటే నిన్ను కోటీశ్వరుణ్ణి చేస్తాం. నువ్వు నీ భార్యతో ఏ విదేశానికో వెళ్ళి హాయిగా బ్రతుకు. ఇప్పుడు కాదన్నావంటే మీరిద్దరూ ఛస్తారు” అని భయపెట్టారు; ఆశపెట్టారు.

“దేవకికి తెల్సి వుంటుందని నమ్మకం ఏమిటి?” అడిగాడు జగదీశ్, వాళ్ళకు కాదని చెప్పడానికి గుండెలు చాల్లేదు.

“తెలియకపోతే తెల్సుకోమ్మని చెప్పు.”

“చెప్పకపోతే?”

“నీ ఖర్మ. ఛస్తారు.”

వాళ్లు కిరాతకులు. అన్నంతపనీ చేస్తారు. దైవం తన కెందుకింత క్లిష్ట పరిస్థితులను సృష్టించాడో; వాపోయాడు జగదీశ్.

“చేస్తాను. ప్రయత్నిస్తాను. అంతవరకు నా భార్య గతి?”

“ఆమె సంగతి మేము చూసుకుంటాం. మరో విషయం నువ్వు బయటకు వెళ్లుతున్నావు. పోలీసులకు చెప్ప ప్రయత్నించవచ్చు. గనక నీ భార్యను తీసుకెళ్ళుతున్నాము.

నువ్వు దేవకి యింట్లోనుండి బయటకు రాగానే మా యిద్దరిలో ఎవరో ఒకరు నిన్ను కల్సుకుంటారు. కూడా రావాలి. బాంబులు ఎక్కడున్న సంగతి చెప్పగానే నీ భార్యను, నిన్ను సురక్షితంగా వదిలిపెట్తాం,'' అన్నారు.

జగదీశ్ కు నవ్వాలో, ఏడ్వాలో అంతుపట్టలేదు. ''నా భార్యను ఎక్కడకు తీసుకెళ్ళతారు?'' ఆదుర్దాగా ఖంగారుతో ప్రశ్నించాడు జగదీశ్.

''నీకు తెలియని చోటుకి! మమ్మల్ని మోసం చేయ ప్రయత్నిస్తే నీ భార్య శవం కానుకగా యివ్వాలిగా!''

''వద్దు. తెల్సుకుని వస్తాను'' భీరువైపోయాడు జగదీశ్.

జగదీశ్ ని ఆ వ్యక్తులు నఖశిఖ పర్యంతమూ గమనించారు. అతను పూర్తిగా భయాందోళనలకు గురయ్యాడని, తప్పక భార్యకోసం చేస్తాడని నమ్మకం కుదిరింది.

''భుజంగరావు ఇపుడు యింట్లో వుండడు. తిన్నగా దేవకివద్ద కెళ్ళి రహస్యాన్ని రాబట్టడానికి ప్రయత్నించు. ఆ సమయంలోనే యింకోపని చేయాలి.''

''ఏమిటి?''

''యురేనియం అను లోహం వాళ్ళ యింట్లో వుంది. రెండు భాగాలుగా వుంటుందట! అది కళ్ళబడితే దేవకిని చంపైనా సరే మోసం చేసైనా సరే ఎత్తుకునివచ్చేసేయ్'' చెప్పారు.

''దొంగతనం చేయలేను'' వేదనతో అన్నాడు జగదీశ్.

''చేయాలి. చేయక తప్పదు. బలవంతంగా మేమే చేయగలం. కానీ, సులువైన మార్గాన్నొదిలి ఆపదలకు గురికాదలుచుకోలేదు. నీయిష్టం. బాంబులు ఎక్కడున్నది, యురేనియం తీసుకురావలిసిన బాధ్యత నీది. ఆ తరువాత నీ ఖర్మ!''

అప్పటికి చీకటి పడిపోయింది.

ఒకడు జలజను అమాంతం ఎత్తుకున్నాడు. జగదీశ్ బెంబేలు పడిపోయాడు. బావురుమనేశాడు. “వద్దు, వద్దు. నేను తెల్సుకుని వస్తాను,” ఆక్రోశిస్తున్నాడు.

“తెలుసుకునివస్తే నీ భార్యను నీకిస్తాం,” అంటూ అడ్డొచ్చిన జగదీశ్ ని ఒక్క నెట్టు నెట్టారు. అల్లంత దూరానికి విరుచుకుపడిపోయాడు.

ఒకడు బయట ఎవరైనా వున్నారా, లేరా అని చూడడం, భార్యతో యింకొకడు వెళ్ళిపోవడం స్పష్టంగా గోచరిస్తూ వుంది జగదీశ్ కు.

4

ఆ దుండగులు జలజను ఎత్తుకెళ్ళి పోగానే జగదీశ్ తనివి తీరా ఏడ్చుకున్నాడు.

ఆ దుర్మార్గులు చెప్పినట్టు చేసి తన భార్యను తను రక్షించుకు తీరాలి. పట్టుదలతో బయలుదేరాడు జగదీశ్.

ఇంట్లోనుండి బయటకురాగానే బయట ప్రపంచం క్రొత్తగాను, వింతగానూ కనుపించినట్టుంది. లైట్ల వెలుగులో తలొంచుకుని చకచక నడుస్తున్నాడు.

భుజంగరావు బాంబులను ఎక్కడ దాచివున్నది దేవకికి తెల్సివుంటుందా? తెల్సినా దేవకి తనతో చెప్తుందా? చెప్పించి తీరాలి. తన భార్యను కాపాడుకోవాలి. ఏవేవో ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

భుజంగరావు బాంబులను ఎందుకు తయారుచేశాడు? భద్రంగా ఎందుకు దాచాడు? యురేనియం బాంబులకు ఉపయోగపడే కీలకపదార్థమని తనకు తెల్సు. ఆ యురేనియాన్ని దుండగులు ఏంచేసుకుంటారు? తన చేతికి అది అందుతుందా?

దేవకి యింటిగేటు నెట్టుకుని లోపలకు ప్రవేశించాడు.

"ఎవరూ?" అంటూ నౌఖరు అడిగాడు.

"మీ అమ్మగార్ని చూడాలి. నా పేరు జగదీశ్!"

"ఉండండి. అడిగి వస్తాను," అంటూ నౌఖరు లోనికెళ్ళాడు.

జగదీశ్ గుండెలు గుబగుబలాడుతున్నవి. మనసుని దిటవు పరచుకుంటున్నాడు. ఏదో భీతి, అదురుపాటు కల్గుతున్నవి. సమాళించుకోడానికి సతమత మవుతున్నాడు.

ఆదరా బాదరా వచ్చిన దేవకి జగదీశ్‌ని చూచి, "ఏమిటి యిలా వచ్చావ్!" అని కొంటెగా ప్రశ్నిస్తూ ఆహ్వానించింది.

అప్పుడే స్నానంచేసి నైట్ గౌన్ ధరించివుంది. ఆమె వెంట్రుకలు తడితో వున్న కారణంగా తళతళమంటున్నవి. ఆమె శరీరం ట్యూబ్‌లైట్ల వెలుగులో వింతగా మెరుస్తున్నది.

"ఏమీలేదు. ఒక్కసారి మిమ్మల్ని చూచి వెళ్ళదామని వచ్చాను" అన్నాడు జగదీశ్, నసుగుతూ.

"పగలు రావచ్చుగా!"

"ఉండబట్టలేకపోయాను. మీవా రున్నారా?"

"లేరు. ఢిల్లీ వెళ్ళి వున్నారు. రేపుదయం వస్తారు. రండి" అంటూ దేవకి మేడపైకి దారితీసింది. ఇల్లు చాలా అందంగావుంది. అన్నీ ఖరీదుగల వస్తువులు. తనకు దేవకితో అక్రమ సంబంధం వున్నప్పటికీ ఇంటికి ఎప్పుడూ రాలేదు. దేవకి వెనుకనే మెట్లు ఎక్కాడు జగదీశ్.

సరదాగా ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకుంటున్నారు. సమయం,సందర్భం రాగానే,"మీకు రెండు ఎస్టేట్‌లు వున్నవట. మీ వారు ఏం చేస్తుంటారు?" అనడిగాడు జగదీశ్.

"మా వారు చేయవలసినవి అన్నీ చేస్తున్నారు. ప్రపంచంలో దేశానికని ఏ వ్యక్తి చేయని సేవ చేస్తున్నారు."

"అంటే?"

"బాంబులు తయారు చేశారు."

"ఎందుకు?" ఆశ్చర్యాన్ని చూపాడు.

"ఆ విషయం నాకు యిదమిద్ధంగా తెలియదు."

"తయారు చేసిన బాంబులతో ఏం చేస్తారు? బాంబులు భయంకరమైనవి. ప్రమాదకరమైనవి. వాటిని ఎలా భద్రపరచి వుంటాడు?"

"నిజమే! తగిన రీతిగానే జాగ్రత్తచేసి ఉన్నారు. మా ఎస్టేటులో భూగర్భంలో దాచి వుంచారు."

ఎక్కడ అని అడిగితే సందేహ పడుతుందని జగదీశ్ జాగ్రత్త వహించాడు.

"బాంబులు తయారుచేయటం మాటలుకాదు. బాంబులను తయారుచేసి ఎలా దాచగల్గారు??" అబ్బురంగా అడిగాడు జగదీశ్.

"తయారు చేయడానికి సదుపాయాలన్నీ సమకూర్చుకున్న మావారికి దాచడం పెద్ద పనికాదు. ఎస్టేటులో ఒక రహస్య ప్రదేశంలో నున్న న్యూక్లియర్ రియాక్టర్ షెల్‌కు వుత్తరంగా మైలు దూరంలో గల మఱ్ఱి చెట్టువద్ద భూగృహంలో దాచి వున్నారు," అని దేవకి చెప్పేసింది.

కొన్ని రహస్య విషయాలు, చెప్పకూడని విషయాలు సైతము స్త్రీలు తమకు మనసు పడిన పురుషులతో చెప్పడం పరిపాటి. ఆమె చెప్పిన విషయాలను జగదీశ్ అయిదారు తడవలు మననం చేసుకుని మెదడులో దాచుకున్నాడు.

"బాంబులను ఎలా తయారు చేస్తారు?" అమాయకంగా అడిగాడు జగదీశ్.

"యురేనియం మూల కారణ మంటారు. యురేనియం చూస్తావా?" అనడిగింది దేవకి. ఆమెది కల్లాకపటం లేని హృదయం. జగదీశ్ అంటే ఆమెకి ప్రాణం. జగదీశ్‌కి తెలియని విషయం చెప్పాలని ఆమె ఉబలాట.

"చూస్తాను" అన్నాడు జగదీశ్.

దేవకి లేచి బీరువా వద్ద కెళ్ళింది.

జగదీశ్ గుండెలు జలదరించి పోతున్నవి. వళ్ళంతా వణికి పోతూంది. తనకి యురేనియం చూపబోతూంది. బాంబులున్న చోటు చెప్పింది. యురేనియాన్ని అపహరించి పారిపోవాలి. భార్యను రక్షించుకోవాలి. మనసుని రాయి చేసుకుంటు న్నాడు. దేవకిని ఏం చేస్తే యురేనియం తీసుకెళ్ళ వచ్చో చకచక ఆలోచిస్తున్నాడు.

బీరువాలో నుండి యురేనియం వున్న పెట్టెలను దేవకి తెరచి, జగదీశ్ ని పిలిచింది.

జగదీశ్ కాళ్ళు వణికి పోతున్నై. మనసు దుర్మార్గంతో నిండిపోతూంది. ఒక విధమైన తెగింపుతో బీరువా వద్దకు నడిచాడు.

"ఇదే ఆ యురేనియం. ఈ రెండు యురేనియం ముద్దలను కలిపితే చాలు. ప్రేలిపోతుంది" అని ఏవేవో చెప్పకు పోతూంది దేవకి.

ఆమె చెప్పు మాటలు జగదీశ్ కు వినబడ లేదు. వాటిని ఎలా అపహరించుకు పోవాలో దీక్షగా ఆలోచిస్తున్నాడు.

జగదీశ్ తన ఊపిరిని బిగపట్టాడు. అమాంతంగా దేవకిని జవిరి పట్టుకుని, చేతులు విరుచుకుంటూ లాక్కెళ్ళాడు. ఆ ప్రక్కనే యేవో తీగలు కళ్ళబడగానే అందుకుని దేవకిని మెరుపులా బంధించాడు.

అతని చేష్టలకు దేవకి నిర్విణ్ణురాలై అవాక్కయి పోయింది. అతనిని అయోమయంగా చూస్తూ వుండిపోయింది. జగదీశ్ ఆమె అరవకుండా ఉండడానికి నోటిలో గుడ్డలు కుక్కేశాడు. క్షణం ఆలస్యం చేయలేదు. యురేనియం ఉండలున్న బీరువా వద్దకెళ్ళాడు.

యురేనియం వేరువేరుగా వుంది. రెండు పెట్టెలలో రెండు

సగాలుగా వుంది. పెట్టెలను తీసుకెళ్ళితే నౌఖర్లు చూచి
ఆటకాయించవచ్చు. లేదా అనుమానపడవచ్చు. ఇంటి నుండి
బయట పడేంత వరకు జాగ్రత్తగా వుండాలనుకుని జగదీశ్
రెండు పెట్టెలలో వున్న యురేనియపు ఉండలను రెండు
చేతులతో పైకి ఎత్తుకున్నాడు. బరువుగా వున్నవి. తన బలా
న్నంతా ఉపయోగించి గట్టిగా పట్టుకున్నాడు.

బరువు మూలంగా ఒక్కో చేత్తో ఒక్కోదాన్ని పట్టుకో
లేక పోతున్నాడు. రెంటినీ కలిపి రెండు చేతులతో మోసు
కెళ్ళాలని పిస్తూంది. అలా మోసుకెళ్ళితే ఎవరైనా చూచి
సందేహించవచ్చు. గనక అలా పట్టుకోలేదు. పట్టుకోడానికి
అప్రయత్నంగా రెండు చేతులు దగ్గరవుతున్నవి.

దేవకి గుండెలు ఆవిరించి పోతున్నవి. యురేనియం
ఉండలు రెండూ కలిస్తే ప్రేలిపోతుంది. ఆ ప్రేలుడికి ఆ
నగరమే ధ్వంసమై జీవకోటి అసాంతం తుడిచి పెట్టుకు
పోతుంది. కోతి చేతికి పూమాల చిక్కినట్టయింది.

యురేనియం పొరబాటున కలిస్తే ప్రళయం సంభవించు
తుంది. ఎందరో మానవులు, ఆ నగరం యావత్తూ భస్మమై
పోతుంది. ఎలా? తన మూలంగా వినాశనం సంభవించ
పోతూంది. జగదీశ్ ఎందుకలా చేశాడు? దేవకి అల్లకల్లో
లంతో గిజగిజ లాడిపోతూంది.

జగదీశ్ ఆదరాబాదరా పిల్లిలా అడుగులు వేస్తూ తిరిగి
చూడకుండా పారిపోతున్నాడు. జగదీశ్ అలా పారిపోవడం
ఆమెకు బాధ అనిపించలేదు. అతను ఆమెను బంధించినందుకు
వేదన పడలేదు. అతని చేతిలో వున్న యురేనియం కలిస్తే
కలుగబోవు దారుణ పరిస్థితులు ఆమెను చలింప జేసినై.
దేవకికి హిరోషిమా, నాగసాకీల మీద అణుబాంబు ప్రయో
గం మూలంగా కల్గిన జన నష్టం, ప్రాణ నష్టం గురించి బాగా
తెల్సు.

జగదీశ్‌కి యురేనియంతో యేం పని? దానిని గురించి అతనికి తెలుసా? అరవలేని స్థితిలో వున్న దేవకి తన్నుకులాడి పోతూంది.

జగదీశ్‌కి అదృష్టం కలిసింది. నౌఖర్లు ఎవరూ యెదురు పడలేదు. వణికే శరీరాన్ని అణుచుకుంటూ గేటు నెట్టుకుని పేవ్‌మెంటు మీదకు వచ్చాడు. అతని చేతులలో వున్న యురేనియం తళతళ మంటూ ధగధగా మెరిసి పోతూంది. అంతలో అతని ప్రక్కగా ఒక వ్యక్తి వచ్చి అతనిని కలుసుకున్నాడు.

5

"ఈ రోజు రాత్రికి మన పని పూర్తి అయితీరాలి. భుజంగరావు వూళ్లో లేడు. ఎస్టేటు ప్లాన్ చూసి తగిన పథకం వేయాలి. కమాన్!" అంటూ అహమ్మద్‌ఖాన్ బల్ల సొరుగు లాగాడు.

అతని అనుచరులైన ఆగాఖాన్, సియాంగ్‌లు అతని కెదురుగా ఆసీనులయ్యారు. ఎస్టేట్ ప్లానుని తిలకిస్తూ పథకాన్ని వివరిస్తున్నాడు అహమ్మద్‌ఖాన్. ఆగాఖాన్, సియాంగ్‌లు అతిజాగరూకతగా వింటున్నారు.

పథకాన్ని యెలా అమలుపరచాలో క్షణాలమీద నిర్ణయమై పోయింది. ముగ్గురూ కార్యశూరులై లేచి నిలబడ్డారు.

"జగదీశ్‌ని ఏం చేయాలి?" అడిగాడు సియాంగ్.

"అలాగే మూసిన గదిలో వుండనీ. తిండిలేక చస్తారు" చెప్పాడు అహమ్మద్‌ఖాన్.

"ఏదైనా ప్రమాదం సంభవించవచ్చునేమో!" తన సందేహాన్ని వెలిబుచ్చాడు సియాంగ్.

"అవును. కీడెంచి మేలెంచమన్నారు. వాళ్ళకు మన రహస్యాలు కొద్దోగొప్పో తెల్సివుంటాయి. ప్రాణాలతో బయట పడితే మన కేనాటికైనా ముప్పే. గనక చంపేయడం మన

వృత్తి ధర్మం!" అన్నాడు ఆగాఖాన్.

"నీ సందేహం సమ్మదగ్గది. మనం వెళ్ళిపోయేంతవరకు జాగ్రత్తపడాలి. సియాంగ్ గో అన్" అని అహమ్మన్ ఖాన్ ఆజ్ఞ జారీచేశాడు.

వెంటనే సియాంగ్ పిస్తోలుని జేబులోనుండి తీసి పట్టుకుని జగదీశ్, జలజ లున్న గదివైపు నడిచాడు. తలుపుల ముందు నిలబడి మెల్లగా తెఅచాడు. పిస్తోలుని ఎక్కుపెట్టాడు.

'ఢాం'అని వినబడింది. కూడా జలజ చావలుపు ఆ గదిని దద్దరిల్లింప జేసేసింది.

"జలజా"అన్న విషాదమైన కేక, కేకతోబాటు'ఢాం' అని పిస్తోలుమోత మళ్ళీ వినబడింది. వెంటనే జగదీశ్ వెఱ్ఱి కేక వినబడింది. సియాంగ్ కర్కశంగా క్రిందపడిపోయిన దంపతు లిద్దరి చేరొక చేతిని పట్టుకుని బడబడ దేహాలను హాలులోకి లాగుకొచ్చాడు. కారే నెత్తురు నేలమీద ధారగా పడి గడ్డకట్టుకు పోతూంది.

"ఈ శవాలను ఏం చేయాలి?" అడిగాడు ఆగాఖాన్.

"ఎక్కడో ఓ చోట పారేయండి."

"పోలీసులు, డిటెక్టివ్‌లు రంగంలోకి వురుకుతారు."

"ఆ లోపు మన పని ముగుస్తుంది. తరువాత ఆ దేవుడూ మనని బంధించలేడు,"అన్నాడు అహమ్మద్ ఖాన్ గర్వంగా.

నెత్తురు మయంతో వున్న జలజ జగదీశ్ లను చూస్తూంటే భయంకరంగా వుంది. లాగుకొచ్చినపుడు పడిన రక్తపు చారలు భీతిని గొల్పుతున్నవి.

6

ఢిల్లీనుండి బయలుదేరిన కారవెల్లి విమానం విమానాశ్రయంలో వురకలుమీద వురకలతో పరుగులతో ఆగింది. ఆగిన విమానంలోనుండి భుజంగరావు దిగాడు.

తన కోసం దేవకి రాలేదని గమనించాడు. కనీసం కారు కూడా రాలేదు. చేసేది లేక టాక్సీని మాట్లాడుకుని ఇంటికి బయలుదేరాడు.

టాక్సీ యింటి గేటుగుండా వెళ్ళి పోర్టికోలో ఆగింది. ఇంట్లోవున్న నౌకర్లందరూ విషాదంగా నిలబడి వున్నారు. భుజంగరావు కారులోనుండి దిగగానే అందరూ ఏకమ్మడిగా బావురు మన్నారు.

భుజంగరావు వాళ్ళను చూచి అర్థంకాక "ఏమయింది" అనడిగాడు ఖంగారుగా.

"రాత్రి అమ్మగార్ని చూడడానికి జగదీశ్ అనే అతను వచ్చాడు. జగదీశ్‌ని అమ్మగారు మేడపైకి తీసుకెళ్ళారు" అని ఒక నౌకరన్నాడు.

"ఎవరా జగదీశ్?"

"ఏమో మాకు తెలియదండి. వచ్చిన జగదీశ్ ఎప్పుడు బయటకు వెళ్ళిపోయాడో మాలో ఎవరమూ చూళ్ళేదు."

"ఏం...నిద్రపోతున్నారా?"

"లేదండి. మా పనులమీద మేమున్నాం. ఎంత సేపటికి రాకపోయేసరికి నేనే పైకివెళ్ళి చూద్దునుగదా...అమ్మగార్ని రెక్కలు విరిచి, బంధించివున్నాడు. ఆదరాబాదరా కట్లు విప్పాను" అన్నాడు మంగయ్య నౌకరు భయంగా.

"ఎవడు వాడు? వాడెందుకు వచ్చాడు? ఎందుకు దేవకిని బంధించాడు?" అని అడిచాడు భుజంగరావు.

"నాకు తెలియదండి. అయితే, అమ్మగార్ని విడిపించగానే ఆదరాబదరా లేచి, పిస్తోలు అందుకుని హడావిడిగా వెళ్లారు. వెళ్ళినవారు ఇంకా తిరిగి రాలేదండీ"అని మంగయ్య జంకుతూ జవాబిచ్చాడు.

భుజంగరావు అదిరిపడ్డాడు. దేవకిని బంధించడం, దేవకి పిస్తోలుతో వెళ్ళడం విచిత్రమనిపించింది. ఏదో అనుమానం

కల్గిందతనికి.

గబగబ మేడపైకి వెళ్లాడు.

యురేనియం వుంచిన బీరువాని తెరిచాడు. ఖాళీపెట్టెలు దర్శన మిచ్చాయి. భుజంగరావుకు గుండెలు జలదరించి పోయాయి. విషయం అర్థమైనట్లయింది.

యురేనియం దొంగలించడానికే ఆ జగదీశ్ ఎవడో వచ్చాడు. వచ్చినవాడ్ని దేవకి మేడపైకి ఎందుకుతోడ్కొని వచ్చింది? వాడెవడు? వాడి కెలా తెల్సింది? తనవద్ద బాంబు లున్న సంగతి దేవకి చెప్పిందా? లేక వాడు తెల్సుకున్నాడా? అంత సులభంగా తెల్సుకోలేరెవరూ...

తనెంతో కట్టుదిట్టాలతో న్యూక్లియర్ చైన్ రియాక్టర్ షెల్ ని నిర్మించి వున్నాడు. దేశీయులకేగాక, విదేశీయులకు ఎవరికీ తెలియకుండా అతిజాగ్రత్త వహించివున్నాడు. ఎలా తెల్సి వుంటుంది?

యురేనియాన్ని దొంగిలించి ఉన్నట్లయితే విషయాలన్నీ తెల్సినవారై వుంటారు. ఎవరు వాళ్ళు? విదేశ కుట్రదారులా? శత్రుదేశ గూఢచారులా?

యురేనియాన్ని తెలుసుకున్న శత్రువులు తనవద్ద వున్న బాంబులను గురించి తెల్సుకునికూడా వుంటారు?

ఆదరాబాదరా భుజంగరావు పిస్తోలుని లోడ్ చేసుకుని గబగబా మెట్లుదిగాడు.

అంతలోనే ఎస్టేటులో పనిచేయువారు చాలామంది వచ్చి ఉన్నారు.

“ఏమిటి?” అడిగాడు భుజంగరావు.

“మన ఎస్టేటులో పెద్ద ప్రేలుడు సంభవించింది” చెప్పారెవరో.

“ఎక్కడ? ఎందుకు?” భుజంగరావు గుండెలు దడదడ లాడిపోయాయి. వళ్ళంతా వణుకు పుట్టిపోయింది. కొంపదీసి

తను దాచిన బాంబులు ప్రేలాయా? తను దాచిన బాంబులు ప్రేలివుంటే ఈ పాటికి నగరమేగాకుండా దక్షిణ భారత దేశమే సర్వనాశనమై, దగ్ధమై, మసైపోయి వుండాలి.

అలా జరగలేదు. మరయితే ప్రేలిందేమిటి? తను దాచిన బాంబులు సురక్షితంగా వున్నాయి? యురేనియం తెలియని మూర్ఖు లెవరైనా కలిపితే నగరమే నాశనమవుతుంది? ఏమిటీ అయోమయం?! మనసు అల్లకల్లోలిత మవుతూంది. వళ్ళంతా చెమట పట్టిపోతున్నది. అవాక్కయి నిలబడి పోయాడు భుజంగరావు.

భుజంగరావు కారు ఎస్టేటు వైపు విద్యుత్ ప్రవాహంలా పయనిస్తూంది. కాసేపటికల్లా కారు ఎస్టేటు చేరుకుంది. న్యూక్లియర్ చెయిన్ రియాక్టర్ షైల్ వున్న రహస్య ప్రదేశం వైపు కారు మళ్ళింది. పొగలు, ఏదో వాసన వేస్తూన్నది. భుజంగరావు గుండె వేగంగా కొట్టుకుంటున్నది.

న్యూక్లియర్ రియాక్టర్ దగ్గరయింది. ఆశ్చర్యం!

ప్రేలిపోయివుంది! అక్కడ ఆకారమే గోచరించలేదు. ధ్వంసమైపోయి వున్నది. కట్టడం పూర్తిగా నేలమట్టమై పోయివుంది. చెల్లాచెదురుగా ఇటుకలు పడివున్నవి.

న్యూక్లియర్ రియాక్టర్ షైల్ని ఎవరో ప్రేల్చేశారు. ఎవరు? ఎందుకు? ఇక్కడున్నట్టు ఎవరు పసిగట్టారు? భుజంగరావు నీరుకారిపోయాడు.

అదరా బాదరా కారెక్కాడు. మర్రిచెట్టువైపు పోనిచ్చాడు. నిముషంలో చేరాడు. ఆశ్చర్యం!—

అక్కడా భూగృహం నాశనమైపోయింది. భూగృహం ప్రేల్చివేయబడి వుంది. అయితే అందులో వుండిన బాంబులు ఏమయినవి? భూగృహాన్ని ప్రేల్చివున్నారు. అలా ప్రేల్చినప్పుడు అందులో భద్రపరచబడిన బాంబులు ప్రేలి వుండాలి. అలా ప్రేలివుంటే సౌత్ ఇండియానే

పూర్తిగా ఈ పాటికి నామరూపాలు లేకుండా పోయి వుండేది. అలా జరగలేదు. అయితే అందులోని బాంబులు ఏమైనాయి?

భయం,ఖంగారు,ఆందోళన,ఆదుర్దా ఏకమ్మడిగా భుజంగ రావును పీక్కు తినేశాయి. గడగడలాడి పోయాడు. ఇక్కడ భూగృహం వున్నట్టు ఎవరు తెల్సుకున్నారు? ఎలా ప్రేల్చారు? ఎందుకు ప్రేల్చారు? బాంబులను దొంగిలించుకు పోయారా? అందులో వుండిన బాంబులను దొంగిలించాలంటే సామాన్యమైన విషయం కాదు.

భుజంగరావు వుండబట్టలేక ధ్వంసమై పోయివున్న భూగృహంలో క్రిందా మీద పడుతూ వెదికాడు. బాంబులేవు.

భుజంగరావు వెట్టి మొఱ్ఱిగా కేకలు పెట్టేశాడు. నోటిలో తడారి పోయింది. ఆ బాంబులు యెంతటి విధ్వంసన శక్తి గలవో తలచుకుంటూంటే భుజంగరావులోని ఆందోళన ద్విగుణీకృత మవుతూంది.

దేవకి ఏమయి వుంటుంది? యురేనియం దొంగిలించిన వారిని అనుసరించి వెళ్ళిందా? అయితే దొంగిలించిన వారు దుర్మార్గులై వుంటారు. దేవకి యెటు వెళ్ళిందో తను తెల్సుకోవాలి. తీవ్రంగా ఆలోచించాడు భుజంగరావు. ఏమీ అంతుపట్ట లేదు. తల తిరిగిపోతూంది.

అయోమయంగా కారెక్కాడు. బయలుదేరాడు. విసుగు పుట్టే వరకు నగరమంతా గాలించాడు.

దేవకి జాడ తెలియలేదు. పబ్లిక్ ఫోన్ బూతులలో నుండి యింటికి ఫోన్ చేసి దేవకి వచ్చిందా అని గంటగంటకూ అడుగుతూ తిరిగాడు. ఇంటివద్ద నుండి రాలేదని జవాబు వచ్చేది. దేవకి కోసం, బాంబులను దొంగిలించిన వారికోసం, యురేనియం దొంగిలించిన వారికోసం ఎంత వెదికినా తను

తెల్సుకోలేడని ధృవపడి పోయింది. ఏమీ పాలుపోలేదు.

పోలీసుల సహాయం అర్థించా లనుకున్నాడు. ఎందుకనో అతనికి మనస్కరించలేదు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించి తను బాంబులను తయారు చేశాడు. అణుశక్తిని వినాశనానికి ఉపయోగార్థం తయారుచేశాడు తను. పైగా మన భారత దేశం అణ్వస్త్రాల ఉత్పత్తిని నిరోధించి వుంది.

ఇండియా అణ్వస్త్ర సమన్విత దేశం కావాలని ప్రగాఢంగా వాంఛించు వారిలో తనూ ఒకడు. అందుకే బాంబులు తయారు చేశాడు. తయారు చేసిన బాంబులు అపహరించబడ్డాయని రిపోర్టిస్తే ప్రభుత్వం ఏమంటుంది? పోలీసులు ఏమంటారు? తనకు సహకరిస్తారా? బాంబులను తెల్సుకోడానికి ప్రయత్నిస్తారా? భుజంగరావు అనుమానంతో తల్లక్రిందు లయాడు.

అలా తిరిగే భుజంగరావుకు ఒకచోట ఒక బోర్డు కళ్ళబడింది. చూశాడు.

"డిటెక్టివ్ యువరాజ్, ప్రయివేట్" అని వుంది.

భుజంగరావులో యేదో ఆశ చెలరేగింది. ధైర్యం కల్గింది. కారుని అటు పోనిచ్చాడు.

7

పోలీసులు అప్పుడే జగదీశ్‌ని స్ట్రెచ్చర్ మీద తీసుకొచ్చి అంబులెన్స్ వాన్‌లోకి యెక్కించ బోతున్నారు. అతని ప్రాణాలు పోలేదు. కొనవూపిరితో వున్నాడు. డిటెక్టివ్ యువరాజ్ సిత్రన్ కారు ఆగడం గమనించి ఇన్‌స్పెక్టర్ ధనార్జనరావు ఆపాడు.

భుజంగరావు, యువరాజ్, నూరీలు ఆదరాబాదరా దిగి వచ్చి జగదీశ్‌ని చూచారు. చూచిన తరువాత వాన్ లోపలకు ఎక్కించారు.

"ఇతనిని నే నెప్పుడూ చూచినది లేదు" చెప్పాడు భుజంగరావు.

"ఈయ నెవరు?" అడిగాడు ధనార్జనరావు.

యువరాజ్ లోపలకు దారితీస్తూ, టూకీగా భుజంగ రావును గురించి చెప్పాడు. అలాగే దేవకిని గురించి కూడా చెప్పాడు.

లోపల జలజ శవం అతిదారుణంగా పడివుంది. రక్తపు చారలు భీకరంగా గోచరిస్తున్నవి. గదిలోనుండి ఈడ్చుకొచ్చి నట్టు నెత్తురు చారలు స్పష్టపరుస్తున్నవి. జలజ హృదయ భాగమంతా ఎఱ్ఱగా ముద్దగా వుంది.

"మీకు యీ విషయమై ఫోన్ యెవరు చేశారు?" అడిగాడు యువరాజ్.

"ఎవరో ఆడ మనిషి."

"కొంపదీసి నా భార్య దేవకి కాదుకదా!?" అడిగాడు భుజంగరావు.

"ఏమో యెలా చెప్పగలం? దేవకి అనుసరిస్తూ వచ్చి ఈ దారుణాన్ని చూచిన పిదప పోలీసులకు తెలియజేయు సమయంలో శత్రువులకు చిక్కుపడి ఉండొచ్చు. లేదా ఆమె యెందుకనో భయపడి పోలీసులకు చెప్పి యిక్కడ నుండి తప్పుకుని వుండి ఉండొచ్చు," చెప్పాడు యువరాజ్.

"అయితే నా దేవకి యింటికి వచ్చి ఉంటుందా?"

"ఏమో? ఫోన్ చేసి కనుక్కోండి" అని చెప్పి యువరాజ్ ఆ యింటి నంతటిని గాలించడం ప్రారంభించాడు. అప్పటికే పోలీసులచే ఆ యిల్లు సోదా చేయబడి ఉంది. కాని యువ రాజ్‌తో నూరి, ధనార్జనరావులు కూడా పరిశీలించడం ప్రారంభించారు.

"మిస్టర్ ధనార్జనరావ్! ఈ కేసు అతి భయంకరంగా ఉంది. బాంబులు దొంగిలించబడ్డాయి. కాక యురేనియం

దొంగిలించ బడివుంది. యురేనియం మూలంగా మన యీ నగరానికి వినాశనం సంభవించు ప్రమాదముంది. మనమిపుడు ప్రాణాలతో ఉన్నాం. అణుబాంబు ప్రేలడానికి సెకండులో మిలియనో వంతు కాలం చాలు. అంటే బాంబు ప్రేలింది, ప్రమాదం సంభవించింది, అందరమూ మరణిస్తున్నాం అని గ్రహించే లోపు నిహతులై పోతాం. గనక మీరు మీ సిబ్బందిని వెంటనే మేల్కొల్పాలి," చెప్పాడు యువరాజ్.

"ప్రపంచమే శాంతి, శాంతి, శాంతి అని ఘోషిస్తూంది. ఈ భుజంగరావు దేనికి బాంబులను తయారుచేశాడు?" విసుక్కున్నాడు ధనార్జనరావు.

"ఫ్రాన్సులో తయారయే యుద్ధసామగ్రి తప్పనిసరి ఇతర దేశాలకు అమ్మితీరాలి. లేకుంటే యుద్ధపరికరాలను ఉత్పత్తి చేయు రెండున్నర లక్షల మందికి నిరుద్యోగం సంప్రాప్తమవుతుంది. ఇలా వుంటె శాంతి, శాంతి అని ఎవరెంత ఘోషించినా నిష్ఫలం. ఫ్రాన్స్ ఒకటే కాదు, స్తోమతగల దేశాలన్ని యిపుడు అణ్వస్త్రాలు తయారు చేసుకోవడమే గాక నవీన యుద్ధస్సామగ్రిని వుత్పత్తి గావించుకుంటున్నవి" చెప్పాడు యువరాజ్.

"మీరు చెప్పేది పులిని చూచి నక్క వాత పెట్టుకోవాలనా?" హేళనగా అన్నాడు ధనార్జనరావు.

"అవసరమైతే వాతలు పెట్టుకుని పులిలా కనబడడానికి ప్రయత్నించాలి. లేనిచో నక్కే అనుకుని కబళించడానికి రాజ్య విస్తరణ కాంక్షగల కర్కోటకులు మీదపడతారు," హెచ్చరించాడు యువరాజ్.

సూరి ఒక అలమారను తెరచాడు. అందులో ఒక డైరీ కనిపించింది. దానిని అందుకున్నాడు.

యువరాజ్ ఆ డైరీని ఆత్రుతగా తిరగవేశాడు. అది

న్యూక్లియర్ సైంటిస్టు అయిన బ్రాంట్ ది!! డైరీలో
తయారుచేసిన బాంబుల వివరాలున్నవి. యురేనియం గురించి, భుజంగరావును గురించి వ్రాయబడి వుంది.

"ఈ బ్రాంట్ ఎవరు?" అడిగాడు యువరాజ్ భుజంగ రావుని.

"బ్రాంట్ ఛీఫ్ సైంటిస్ట్, అండ్ ఇంజనీయర్!"

"బ్రాంట్ తన డైరీని ఎక్కడో జారవిడుచుకుని వున్నాడు. డైరీ శత్రువుల చేతులలో దురదృష్టవశాత్తు పడివుండాలి. శత్రువులు బాంబులను అపహరించారు. మిస్టర్ ధనార్జన రావ్! మీరు వెంటనే ఈ చుట్టుప్రక్కలనుండి వాకబు చేయడం ప్రారంభించండి. ఈ ఇల్లెవరిది? ఎవరుండినారు? రాత్రి ఇక్కడేం జరిగింది? ఆరాతీయండి" చెప్పకుపోయాడు యువరాజ్.

భుజంగరావు న్యూక్లియర్ చెయిన్ రియాక్టర్ పైలున్న భూగృహాన్ని చూపించాడు. యువరాజ్ సునిశితంగా చూశాడు.

అన్నీ ప్రేలిపోయి నామరూపాలు లేకుండా వున్నై. చుట్టుప్రక్కల ప్రదేశాలను దీక్షగా పరిశీలించాడు యువ రాజ్.

గుట్టలు, మిట్టపల్లాలు, చెట్లు, చేమలు పొదలు ఆ ప్రదేశ మంతా దట్టంగా వుంది. మనిషి నడవడానికి కష్టతరమైనదిగా గోచరిస్తూంది. అటువంటి చోటుగుండా బాంబులను శత్రువులు ఎలా తీసుకెళ్ళి వుంటారు?

"మిస్టర్ భుజంగరావ్, మోటారు వాహనంమీద బాంబులను తరలించివుంటే మనం వచ్చిన రోడ్డుమీదుగానే జరిగి వుండాలి. అలా జరిగివుంటే ఎస్టేటులో పనిచేయువారు తప్పక చూచివుండాలి. మీరు అడిగిచూచారా?" అడిగాడు యువరాజ్.

"లేదు. ఈ ఖంగారులో అడగ లేదు."

"సూరీ! నీవెళ్ళి తెల్సుకురా" చెప్పి పంపాడు.

సూరి అక్కడనుండి కదిలాడు.

భూగృహం వున్న స్థలం అతి మర్మంగా వుంది. అక్కడ నుండి రోడ్డు దారి సరీగా లేదు. బాంబులు అతి జాగ్రత్తగా తీసుకెళ్ళవలసిన పని.

యువరాజుకు ఏమీ అంతుపట్టక దగ్గర్లోవున్న మర్రి చెట్టును ఎక్కి బైనాక్యులర్ పెట్టుకుని చూశాడు. చాలా చాలా దూరంలో గీతగీచినట్లు సముద్రం కనబడుతోంది. యువరాజ్ మనసు వురకలు వేసింది. అదరా బాదరా చెట్టు దిగాడు.

"భుజంగరావుగారూ! శత్రువులు బాంబులను హెలికాఫ్టర్ సాయంతో తీసుకెళ్ళి వుండాలని అనుమానిస్తున్నాను" చెప్పాడు యువరాజ్.

"హెలికాప్టర్‌తోనా...! ఎలా సాధ్యం?" ఆశ్చర్య పోతూ అడిగాడు భుజంగరావు.

"మీ ఎస్టేటుకి దగ్గర్లో సముద్రముంది. బాంబులుండిన భూగృహం తెలియగానే కాపలా లేని కారణంగా దొంగి లించడం తేలిక. అసలు మీరు కాపలా మనుషులను ఎందుకు నియమించలేదు?"

"కాపలా వుంచితే అనుమానం కల్గుతుంది గనక."

ఇంతలో సూరి చేరుకుంటూ, "సార్, ఇటువైపు ఎటు వంటి మోటారు వాహనమూ వెళ్ళలేదు. అయితే ఈ ఎస్టేటు పైభాగంలో విమానాల మోత వినబడిందని సాక్ష్యాలు లభించాయి" చెప్పాడు.

"నా అనుమానం ధృవపడింది. శత్రువులు హెలికాప్టర్ వుపయోగించివున్నారు" అని యువరాజ్ ఆలోచిస్తూ వుండి పోయాడు.

ముగ్గురూ వెళ్ళి కారెక్కారు. కారు బయలుదేరింది.

భుజంగరావు కారులో వున్నంతసేపూ దేవకిని, యురేనియాన్ని - బాంబులను కలవరిస్తూనే వున్నాడు. భుజంగరావుకు ధైర్యం చెప్పి, యింటివద్ద దింపి, యువరాజ్ సూరీలు తమ యింటికి బయలుదేరారు.

నగరం యావత్తూ పోలీసుల హడావిడితో నిండివుంది. పోలీసులకు దేవకి ఆచూకీ తెల్సివుంటుందా? దేవకి ఏమై వుంటుంది?

ఇంతలో స్రైతన్ ఇంటి ఆవరణలోకి మళ్ళింది.

డిటెక్టివ్ లిద్దరూ దిగి లోపలకు అడుగుపెట్టారు.

నౌఖరు ఎదురై ఏదో చెప్పడానికి నోరు తెరిచాడు. అదే సమయానికి టెలిఫోన్ మోగింది.

యువరాజ్ ఫోన్ వద్దకు నడిచాడు. రిసీవరందుకుని, "హలో" అన్నాడు.

"ధనార్జనరావుని మాట్లాడుతూంట. మా బలగం నగరాన్ని యావత్తూ తీవ్రంగా గాలిస్తూంది. అనుమానాస్పదమైన సమాచారం యింకా అందలేదు. హఠాత్తుగా నగరాన్ని పూర్తిగా వెదకడంలో సాధక బాధకాలు చాలా యెదురైయ్యాయి. దూషణలను, భూషణలను సమాళించుకుంటూ వెదుకుతున్నాం. ప్రతి వ్యక్తినీ, ప్రతి యింటినీ చెక్ చేయుటం ఏ డిపార్టుమెంటుకైనా కష్టతరమైన పని. నవీన పరికరాలతో ప్రారంభించాము. ఫలితం యెలా వుంటుందో చెప్పలేను."

"ప్రస్తుత పరిస్థితులు అటువంటివి. చేయగలిగినది, చేయవల్సినది గనక చేసితీరాలి," అన్నాడు యువరాజ్.

"ఏమో? నాకు సందేహంగానే వుంది. యురేనియం దాచడం చేతకాని వారు దొంగిలించి వుండరు."

"నిరుత్సాహ పడకండి" చెప్తూ యువరాజ్ రిసీవర్ పెడుతూ నౌకరు వంక చూశాడు.

"మీ కోసం ఒకావిడ వచ్చింది. మీరు వచ్చేంత వరకు ఇక్కడే ఉంటానన్నది," అన్నాడు నౌకరు.

యువరాజ్ కు ఆశ్చర్యమేసింది. "ఎక్కడుంది?" అడిగాడు. నౌకరు పిలుచుకు వచ్చాడు.

ఆమె దేవకి! యువరాజ్ సూరీలకు ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది.

"ఏమిటమ్మా యిది, మీ కోసం పోలీసులు, మీ భర్త ఆందోళన చెందిపోయి వెదుకుతున్నారు. నా వద్దకు ఎందుకు వచ్చారు? మీరు అనుసరించిన దుండగులు ఎవరు? ఎక్కడుంటున్నారు?" అడిగాడు యువరాజ్ కూర్చుంటూ.

దేవకి యెటువంటి అరమరికలు లేకుండా, తు. చ. తప్పకుండా తనకు జగదీశ్ కు అక్రమ సంబంధం ఉండటం దగ్గరనుండి చెప్పడం ప్రారంభించింది.

సూరి అతి జాగ్రత్తగా ఆమె చెప్పే విషయాలను నోట్ చేసుకుంటూన్నాడు.

"అంటే మీరు ఆ శత్రువులను అసలు చూళ్ళేదా?"

"లేదు. కేవలం వాళ్ళ కారుని అనుసరిస్తూ వెళ్ళాను. ఆ ఇంట్లోకి వెళ్ళటానికి ధైర్యం చాలలేదు. పిస్తోలు చప్పుడు విని పోలీసులకు ఫోన్ చేశాను."

"మరి నా వద్దకు యెందుకొచ్చారు?"

"క్షణికోద్రేకానికి లోనై ఒక అమాయకురాల్ని బలి యిచ్చాను. జగదీశ్ కొనవూపిరితో వున్నాడు. యురేనియం అపహరించ బడింది. మీ వద్దకు మా వారు వచ్చారు. మీరంతా జగదీశ్ ని చూడడం నేను గమనిస్తూనే వున్నాను. మీరు ప్రయివేట్ డిటెక్టివ్ లు. జరిగిన విషయాలు మీతో చెప్పి, ఆ దుర్మార్గులను చీల్చి చండాడాలని అనుకున్నాను" పౌరుషంగా అన్నది దేవకి.

"మీరు జగదీశ్ తో కలవడం భుజంగరావుకు తెల్సా?"

"తెలియదు."

"ఇపుడు తెలిస్తే...!"

దేవకి అంతవరకు కోపంతోను, ఆవేశంతోనూ వున్నదల్లా బావురుమని యేడ్వడం ప్రారంభించింది.

"ఏడ్వకండి. ఏడ్వడం దేనికి?" లాలనగా అన్నాడు యువరాజ్.

"మా ఆయన దైవసమానులు.ఆయనకు ద్రోహం చేశాను. నాలోని వుద్రేకాలను, ఆవేశాలను అణచుకోలేని నీచు రాల్ని. నాకీ జన్మలో ప్రాయశ్చిత్తంలేదు," ఏడుస్తూంది దేవకి.

కొన్ని సందర్భాలలో చెడుకున్నంత బలం మంచికుండదు. వివేకం మేల్కొన్న తరవాత తలుచుకుంటే ఆ బాధ, నరక యాతన చెప్పనలవి కానిది. "చూడమ్మా... దుఃఖించి లాభంలేదు. భుజంగరావు మీరు ఏమయ్యారోనని ఆందోళన చెందుతున్నాడు. వెళ్ళి ఆయనకు కనబడండి," చెప్పాడు యువరాజ్.

"నేనెలా ఆయన ముఖం చూడడం! నా మూలంగా యురేనియం దొంగిలించబడింది."

"యురేనియమే కాదు. బాంబులూ దొంగిలించబడ్డాయి," చెప్పాడు యువరాజ్.

"బాంబులు కూడానా!?" అదిరిపోయింది దేవకి.

"అవును. మీరు బాంబులున్న ప్రదేశం జగదీశ్ కు చెప్పారా?"

"చెప్పాను."

యువరాజ్ కు 'కథ' బోధపడిపోయింది.

"ఇక చింతించి లాభం లేదు. శత్రువుల అదృష్టం మూలంగా, మన దురదృష్టం మూలంగా బాంబులు దుండగులు చేత పడ్డాయి. జరగవల్సిన కార్యక్రమం ఆలోచిం

చాలి. మీ వారికి ఫోన్ చేయనా?" అంటూ రిసీవర్ అందుకోబోయాడు యువరాజ్.

ఆ టెలిఫోన్ గణగణ మ్రోగింది.

రిసీవరందుకుని హాలో అన్నాడు.

"ఎవరూ?" అని వినబడింది. యువరాజ్‌కు ఆశ్చర్యమేసింది. తనింటికి ఫోన్ చేసి ఎవరూ అని అడగటం ఏమిటి?

"యువరాజ్‌ని."

"మిస్టర్ యువరాజ్! భుజంగరావు యింటిలో దొంగిలించబడిన యురేనియం మావద్ద వున్నది," అని అన్నాడు ఆ వ్యక్తి.

యువరాజ్ అదిరిపడ్డాడు. గుండెలు గడగడ లాడేయి. సూరికి సైగ చేశాడు. సూరి ఎక్స్‌టెన్షన్ ఫోన్ వద్దకు పరుగెట్టాడు. దేవకి అయోమయంగా డిటెక్టివ్ లిద్దరినీ చూస్తూ నిలబడింది.

"నువ్వెవరివి! యురేనియం నీవద్ద వుందని చెప్పడం విచిత్రంగా వుంది," అన్నాడు యువరాజ్

"నే నెవరయింది విపులంగా చెప్పడానికి ఇపుడు తీరిక లేదు. పోలీసులు యురేనియం ఉన్న యింటిని సమీపిస్తున్నారు. పోలీసులు వచ్చారా... ఈ నగరం నాశనం చేసేస్తాను. నేను చచ్చినా మా దేశం కోసం అని తృప్తిపడ్తాను."

యువరాజ్ కి ఏమీ అంతు పట్టలేదు.

"సంగతేమిటి?" అడిగాడు యువరాజ్ తనలో ఆందోళన వున్నా అణచుకుంటూ.

"నగరంలో వెదుకుతూ వస్తున్న పోలీసుల వద్ద నవీన పరికరాలున్నవి. సాధనాలూ వున్నవి. అవి యురేనియాన్ని ఇట్టే పసిగట్టి చూపగలవు. యురేనియం వున్న విషయం తెలిస్తే మమ్ములను సజీవంగానో, అజీవంగానో పోలీసులు బంధించగలరు. మేము పోలీసులకు చిక్క దలచుకోలేదు."

"అయితే పారిపోండి," చెప్పాడు యువరాజ్.

"పారిపోవడానికి వ్యవధి మించి పోయింది. యురేనియంతో వెళ్ళితే పోలీసులు అటకాయిస్తారు. యురేనియం వదలి వెళ్ళితే ఆ యింట్లో వుండినది మేమని పోలీసులు పసిగట్టి మమ్ములను బంధించ గలరు," చెప్పాడు అహమ్మద్ ఖాన్.

"అందుకని నేనేం చేయాలి?"

"మీకు ప్రభుత్వ వ్యక్తుల మధ్య పలుకుబడి ఉందని, మీ మాట శిరసావహిస్తారని మాకు తెల్సు. మేము అన్నిటికి తెగించిన వారం. దొంగిలించిన బాంబులు చేరవల్సిన చోటికి చేరినవి. మా పని నెరవేరింది. కాని యురేనియాన్ని దొంగిలించి తరలించుకు పోవాలని అనుకున్నాం. సాధ్యపడలేదు. యురేనియానికి గల శక్తి మీకు తెలియంది కాదు. క్షణంలో ఈ నగరాన్ని ధ్వంసం చేయగలం. ఎందరో అమాయకులు, పసిపిల్లలు, నిలువునా భస్మమై పోతారు. ఆ ప్రమాదం మీ నగరానికి కలగకూడదనుకుంటే మీరు మమ్ములను పోలీసుల బారినుండి తప్పించాలి," అన్నాడు అహమ్మద్ ఖాన్.

యువరాజ్ కు మతి పోయినట్టయింది. శత్రువులు అన్నంత పనీ చేస్తారని యువరాజ్ కు తెల్సు. దేశభక్తి మెండుగా గల వ్యక్తులే గూఢచారి వృత్తిలోనూ, తదితర కార్యకలాపాలలో ప్రవేశిస్తారని జ్ఞప్తికి వచ్చింది. పోలీసులు దగ్గరయితే బందీలు కావడానికి శత్రువులు యిష్టపడని కారణంగా అసూయా ద్వేషాల మూలంగా రాక్షస మనస్కులై యురేనియం సహాయంతో నగరాన్ని నాశనం చేయ బూనుకుంటారు.

ఇపుడెలా? తను శత్రువులను ఆపగలడా? గుండెలు జలదరించి పోయినై. నోటిలో తడారిపోయింది.

"నేను కేవలం ప్రయివేట్ డిటెక్టివ్ ని. అంత మాత్రాన

అంతటి ప్రమాదకరమైన యురేనియం శత్రువుల వద్ద వున్నదని తెల్సీ చెప్పకపోతే ప్రభుత్వ దృష్టిలోనే గాక మన స్వాత్మ ముందూ ఘోర నేరస్థుణ్ణవుతాను. అసలు యింతకీ మిమ్ములను నేనెలా తప్పించగలను?" అడిగాడు యువరాజ్.

"మీరు యిక్కడకు మీ నూరితో సహా వస్తే చెప్పగలను. ఒక హెచ్చరిక. ఈ యిల్లున్న వీధిలో పోలీసుల బందోబస్తు పెరిగింది. ఏ మనిషీ ఏ యింట్లోగానీ, బయటకుగానీ వచ్చినా, వెళ్ళినా 'లైడిటెక్టర్ల' ముందు నిలబెట్టి పోలీసులు ప్రశ్నిస్తున్నారు. గనక మేము బయటకు వెళ్ళితే లైడిటెక్టర్స్ వెంటనే పట్టివ్వగలవు. అందుకని మేము బయటకు వెళ్ళదలుచుకోలేదు."

"ఇక సెర్చివారెంట్లంతో యింట్లో ప్రవేశించి ప్రత్యేక సాధనాలతో పరిశోధించబోవు పోలీసులను ఆపలేము. వారు ప్రవేశించడానికి ఇంక అరగంట కాల వ్యవధి వుందని తెలుస్తున్నాను. ఈలోగా మీరు మీ నూరితో ఈ యిల్లు చేరుకోవాలి. లేదా సరిగ్గా పన్నెండున్నరకో, లేక పోలీసులు మా గుమ్మం ముందు అడుగు పెట్టగానే నగరంలో అణుబాంబు ప్రేలుతుంది. చెప్పినది చేయడానికి, విపత్కర సమయాల్లో యెటువంటి ఘాతుకం చేయడానికి వెనుకాడని మనుషులం. మా యింటి అడ్రసు లాలా బజార్, నెంబరు ముప్పై!!"

అంటూ అహమ్మద్ ఖాన్ రిసీవర్ పెట్టేశాడు.

యువరాజ్ శిలాప్రతిమలా నిలబడి వుండిపోయాడు.

8

"వెల్ కమ్ మిస్టర్ యువరాజ్! మీరు వస్తారని మాకు తెల్సు. రాకుంటే జరుగబోవు పరిణామం అతిభయంకర

మైనదని మీకూ తెల్సు. ఏ పౌరుడూ తమ దేశీయులను అన్యాయంగా బలి యివ్వడానికి ఒప్పుకోడు," అంటూ అహమ్మద్ ఖాన్ డిటెక్టివ్ యువరాజ్, సూరీలను ఆహ్వానించాడు.

డిటెక్టివ్ లిద్దరూ లోపలకు ప్రవేశించారు. వెంటనే సియాంగ్, ఆగాఖాన్ లు తమ పిస్తోళ్ళను గురిపెట్టితయారుగా వున్నారు. టిక్కా ఖాన్ యురేనియాన్ని కలపడానికి సిద్ధంగా నిలబడి ఉన్నాడు. అక్కడి పరిస్థితులు చూచిన డిటెక్టివ్ లిద్దరూ గడగడ లాడిపోయారు.

"ఏమిటీ పాశవిక చర్య??" అడిగాడు యువరాజ్.

"కాదు. పాశవికం కాదు. నేర్పు, నైపుణ్యం, అణు బాంబులు తయారు చేయడం పెద్ద పెద్ద దేశాలకే సాధ్య పడడంలేదు. ప్రయివేటుగా కేవలం ఒక వ్యక్తి తన ఆధ్వ ర్యంలో అణ్వస్త్రాలు ఉత్పత్తి చేయడం ప్రపంచ చరిత్రలో అపూర్వం. ఆ అణ్వస్త్రాలను ప్రభుత్వానికి అప్పగించడం ఆశ్చర్యకరమైన విషయం. ఈ విషయం తెల్సుకుని అపహ రించడంలో తప్పులేదు. కొన్ని అవాంతరాల మూలంగా మీ వరకు వెంటనే తెల్సింది. పోలీసులు చక్రబంధం వేశారు. చిక్కుపడడం ఖాయం. ఆ చిక్కుల్లో పడకుండా బుద్ధి బలాన్ని ఉపయోగించి తప్పించుకొనుటకు ప్రయత్నించడం వివేకుల లక్షణం!"

చెప్పాడు అహమ్మద్ ఖాన్ తలుపులు మూసి.

"నన్ను అడ్డంపెట్టి మీరు తప్పించుకోలేరు" అన్నాడు యువరాజ్.

"తప్పించుకోలేకపోతే మీరు,మీ ప్రజలు అనుభవిస్తారు. యురేనియం గురించి మీకు బాగా తెల్సు," అన్నాడు అహమ్మద్ ఖాన్.

వాళ్ళను చూస్తుంటే అన్నంత పనీ చేస్తారని భయంగా

వుంది. టిక్కాఖాన్ చేతులలో వున్న యురేనియాన్ని చూస్తూంటే హిరోషిమా, నాగసాకీలు గుర్తుకు వస్తున్నవి. హిరోషిమా, నాగసాకీలలో హతులైన అమాయకులు, పిల్లలు కళ్ళముందు మెదిలారు.

"ఎలా తప్పించుకుంటారు? నేనేం చేయాలి?" అడిగాడు యువరాజ్,

యువరాజ్ యెన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని వున్నాడు. కొన్ని లక్షల మంది ప్రాణాలు కాపాడ బడా లంటే ఆ సమయంలో వారు చెప్పినట్టు నడుచుకుని తీరాలి. తనకున్న బుద్ధిబలంతోను, వివేకంతోను అక్కడి ఆ పరిస్థితు లలో వారిని బంధించడం దుస్సాధ్యం.

"తప్పించు కోవడం సింపుల్! మీరు మీ కారులో ఎక్కాలి. మీతో బాటు మేమూ యెక్కుతాము. మనతో బాటు కారులో యురేనియం వుంటుంది. యురేనియం టిక్కా ఖాన్ చేతిలోనే ఉండి ఏ క్షణాన్నైనా కలపడానికి సిద్ధంగా వుంటుంది. మీ కారు నెంబరు ప్లేటుమీద అచ్చ తెలుగు అక్షరాలు, తెలుగు అంకెలుండడం మూలంగా ప్రఖ్యాత డిటెక్టివ్ యువరాజ్ కారని ప్రతి ఒక్కరికీ తెల్సు. పైగా మీరే డ్రైవ్ చేస్తూ వుంటారు. డిటెక్టివ్ వున్న కారుని యెవరూ తనిఖీ చేయరు."

"నేను కేవలం ప్రయివేట్ డిటెక్టివ్‌ని! అంత మాత్రాన పోలీసులు నా కారుని ఆపి సోదా చేయ రనుకోవడం మీ భ్రమ! తప్పక పోలీసులు నా కారుని, కారులో వుండబోవు మిమ్మల్ని, నన్ను తనిఖీచేసి తీరుతారు," చెప్పాడు యువ రాజ్.

"అవును. అలా చేయకుండా మీ పలుకుబడిని, మీ హోదాని ఉపయోగించాలి. అలా గాకుండా మీరు మౌనంగా ఉంటే పోలీసులు కారు వద్దకు చేరుకునే లోపు కారులో

ఉండే యురేనియం ప్రేలిపోతుంది. ఆ తరువాత చింతించ డానికీ వ్యవధి వుండదు,'' చెప్పాడు అహమ్మద్ ఖాన్.

యువరాజ్ అల్లల్లాడి పోయాడు. ఏం చేయాలో అంతు తెలియడం లేదు. శత్రువుల పథకం అభేద్యంగా వున్నది.

శత్రువులు ప్రస్తుతానికి తప్పించుకున్నా తంటాలు పడి బంధించడానికి అవకాశం వుంటుంది. కానిచో యురేనియం ప్రేలుడు మూలంగా కలిగిన నష్టాన్ని తనే కాదు. భగవంతుడూ పూరించలేడు. గనక శత్రువులను తనచేతుల మీదుగా సురక్షితంగా చేరవేయడానికే నిశ్చయించుకున్నాడు యువరాజ్.

"అలాగే! కేవలం మీ కోసం కొన్ని లక్షలమంది భారతీయులను బలి యివ్వలేను. మిమ్మల్ని పోలీసుల దృష్టిలో పడకుండా చేరవేయడానికి నా సర్వ శక్తులూ ధారపోస్తాను" దృఢ దీక్షతో చెప్పాడు యువరాజ్.

"వెరీ గుడ్! మీరు ఒప్పుకుంటారని మాకు తెల్సు. వేరే గత్యంతరం లేదుగా!"

నవ్వుతూ అహమ్మద్ ఖాన్, ఆగా ఖాన్‌కు, సియాంగ్‌కు ఏదో సైగ చేస్తూ తన జేబులో వున్న పిస్తోలును బయటకు తీశాడు. తీసిన పిస్తోలుని యువరాజ్ మెడమీద ఆన్చిపెట్టాడు.

ఆగాఖాన్, సియాంగులు తమ చేతులలో వున్న పిస్తోళ్ళను జేబులలో పెట్టుకుంటూ సూరిని సమీపించారు. యువరాజ్‌కు అయోమయంగా ఉంది.

యురేనియం ముద్దలను పట్టుకుని వున్న టిక్కా-ఖాన్ అలాగే వున్నాడు.

ఆగాఖాన్, సూరిని అమాంతంగా క్రిందకు పడతోశాడు. క్రిందపడ్డ సూరిని చేతులు, కాళ్ళని వెనుకకు విరిచారు.

"ఏం చేస్తారు?" గర్జించాడు యువరాజ్.

"చేస్తున్నాం, చూచి తెల్సుకోండి" అన్నాడు అహ

మ్మద్ ఖాన్ పిస్తోలు గొట్టాన్ని యువరాజ్ మెడమీద అదుముతూ.

"ఎందుకు?" ఉరిమాడు యువరాజ్.

"మా జాగ్రత్త కోసం!"

"అంటే??"

"మిస్టర్ యువరాజ్! మీరు బహుముఖ ప్రజ్ఞావంతులు. ఎత్తుకు పై యెత్తులు వేయడంలో అందె వేసినవారు. అటు వంటి మీ ముందు తగు జాగ్రత్తలో ఉండాలన్నది మా సిద్ధాంతం. మీ కారులో కూర్చున్న మమ్మల్ని ఏం చేస్తారో మాకేకాదు-మీకే తెలియ దనుకుంటాను. గనక సూరిని ఇక్కడే యీ యింట్లోనే విచిత్ర పరిస్థితులలో వదిలి పెడుతున్నాం. మీరు మమ్మల్ని వీలైనంత తొందరలో దిగబెట్టి, పోలీసులు ఈ యింటికి చేరుకోక మునుపే ఇక్కడకు చేరుకుంటే మీ సూరి మీకు దక్కుతాడు," అహమ్మద్ ఖాన్ చెప్పాడు.

ఇంతలో సూరిని విరిచి కట్టిపడేశారు.

"సార్! నాకోసం మీరు దిగులుపడకండి. నా ప్రాణాలు పోయినా ఫరవాలేదు. ముందు ఈ నగరాన్ని, నగరంలో వున్న ఎందరో అమాయకుల్ని కాపాడండి" అన్నాడు సూరి ఆవేశంతో.

బంధించిన సూరిని అల్లాగే ఎత్తుకుని తలుపులకు ఆరడుగుల దూరంలో పడేశారు. యువరాజ్ వాళ్ళు ఇంకా ఏం చేస్తారో వింతగా చూస్తున్నాడు భీతితో.

సియాంగ్ తన జేబులోనుండి ఒక కొవ్వొత్తిని తీశాడు. సిగర్ లైటర్‌తో కొవ్వొత్తిని వెలిగించాడు. సూరికి తలుపులకు మధ్య వుండే కొవ్వొత్తిని పడుకోబెట్టాడు.

యువరాజ్‌కు అంతా అయోమయంగా వుంది. సియాంగ్ వెలిగించిన కొవ్వొత్తిని నేలమీద నిలబెట్టకుండా, ఎందుకు

పడుకో బెట్టాడో అర్థంకావడంలేదు. ఆశ్చర్యంగా తిలకిస్తున్నాడు. వేడికి మైనం కరిగి నేలమీదకు ప్రాకుతూంది. వత్తి వెల్గుతూంది.

ఆగాఖాన్ ఒక గదిలోనుండి ఒక పెద్ద డబ్బాను మోసుకు వచ్చాడు. అది కిరోసిన్ డబ్బా. మూతలేదు. బాగా తెరచి వుంది. అందులో నిండుగా పెట్రోలుంది. యువరాజ్ గుండెలు గడగడలాడిపోయాయి. ఏమిటీ పైశాచికం! నూరిని సజీవంగా తగులబెట్టుతారా? తనలోని ఆవేశాన్ని, వుద్రేకాన్ని రౌద్రాన్ని ఆపుకోలేకపోయాడు యువరాజ్.

''నో, నో'' అని అరుస్తూ ఆగాఖాన్‌ని అటకాయించబోయాడు యువరాజ్.

అహమ్మద్‌ఖాన్ యువరాజుని ఇరికించి పట్టుకునేశాడు. యువరాజ్ తల్లిడిల్లిపోయాడు.

ఆగాఖాన్ పెట్రోలున్న డబ్బాను తలుపుల వద్దకుతీసుకు వెళ్ళి దింపాడు. తలుపులకున్న గడియను తీశాడు. డబ్బాను బాగా ఏటవాలుగా వాల్చి తలుపులకు ఆన్చిపెట్టాడు.

ఇపుడు తలుపులు నెట్టితే చాలు పెట్రోలున్న డబ్బా ఢభ్లున పడిపోతుంది. అలా పడగానే-క్రిందకు జారినపెట్రోలు క్రొవ్వొత్తిమీదుగా వచ్చి నూరిని చుట్టుముట్టేస్తుంది. నూరి పెట్రోలు మంటలలో సజీవంగా భస్మమైపోతాడు.

యువరాజ్ కంపించిపోయాడు. శరీరమంతా చమటలతో తడిసిపోయింది.

''మిస్టర్స్!! ఇది అన్యాయం, దారుణం. నానూరిని ఇటువంటి దుర్గతికి లోనుచేయకండి'' యువరాజ్ గొంతు బొంగురుపోయింది. కాని యువరాజ్ మాటలు ఎవరూ పట్టించుకోలేదు.

అందరూ ఎకాయెకిన యువరాజ్ సిత్రన్ కారువద్దకు దొడ్డి తలుపుగుండా చేరుకున్నారు.

టిక్కాఖాన్ యురేనియం ముద్దలను తయారుగా పట్టు కుని వున్నాడు. మిగతా వారందరూ పిస్తోళ్లను రెడీగా పట్టుకుని వున్నారు.

యువరాజ్ కు మనసులో మనసులేదు. జీవచ్ఛవంలా గున్నాడు. ఖర్మచాలి ఎవరైనా తలుపులు నెట్టారంటే సూరి పెట్రోల్ మంటలలో తగులబడిపోతాడు. ఎవరూ రాక మునుపే శత్రువులను దింపి తను చేరుకోవాలి. సూరిని రక్షించుకోవాలి. ఆత్రుత, ఆవేశం యువరాజులో పరవళ్లు త్రొక్కాయి. కారు స్టార్టు చేశాడు. సిత్రన్ ముందుకురికింది.

సూరి పరిస్థితి తలచుకుంటూంటే గుండెలు జలదరించి పోతున్నై. సూరికి ఎటువంటి ప్రమాదమూ సంభవించకూడ దని భగవంతుని ప్రార్థించుకుంటున్నాడు.

యువరాజ్ సిత్రన్ కారుని పోలీసులు ఆపమన్నట్టు చేతు లూపారు. తను కారు నాపాలి. ఆపకుంటే అనుమానిస్తారు. ఆపితే పోలీసులు తనని, కారులోవున్న వ్యక్తుల్ని లైడిటెక్టర్ల ముందు ప్రశ్నిస్తాడు. లైడిటెక్టర్లు నిజం చెప్తున్నాడా, అబద్ధం చెప్తున్నాడా వెంటనే చెప్పేస్తాయి. ఏంచేయాలో అంతు పట్టలేదు. ధైర్యంచేసి కారునాపాడు యువరాజ్.

టిక్కాఖాన్ యురేనియం కలపడానికి ఆయత్తుడవుతు న్నాడు. మూడు పిస్తోళ్ళ గొట్టాలు యువరాజ్ ని గురిచూస్తూ ఆ కారులో నిక్కపొడుచుకున్నై.

"నేను డిటెక్టివ్ యువరాజ్ ని. అత్యవసరంగా క్రయిమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ధనార్జనరావుని కల్సుకోవాలి. ఎక్క డున్నాడు?" అంటూ యువరాజ్ గంభీరంగా ప్రశ్నిం చాడు.

వాళ్ళు బలవంతంగా సోదాచేయలేదు. పోలీసులు చెప్పారు. కారు కదిలింది.

"మిమ్మల్ని ఎక్కడ దింపాలి?" అడిగాడు యువరాజ్ అహమ్మద్ ఖాన్ని.

"బీచ్ రోడ్ లో!" చెప్పాడు అహమ్మద్ ఖాన్.

కారు వేగాన్ని పుంజుకుంది. చాలామంది యువరాజ్ కారుని గుర్తించి దారిని వదులుతున్నారు. ఒకచోట ధనార్జనరావ్ యెదురయ్యాడు. యువరాజుకి కారుని ఆపక తప్పలేదు.

దగ్గరైన ధనార్జనరావు యువరాజ్ ని ఏదో అడగబోయాడు.

"డియర్ ధనార్జనరావ్, నేను అర్జంటుగా ఐ. జీ.ని కల్సుకోవాలి. వివరాలు తరువాత చెప్తాను," అంటూ యువరాజ్ కారుని కదిల్చాడు.

ధనార్జనరావ్ కారు నాపమని కేకలు పెట్తున్నప్పటికి యువరాజ్ విన్పించుకోలేదు.

ముందు శత్రువులను దింపి సూరిని కాపాడుకోవాలి. యువరాజుకి అదే ధ్యేయంగావుంది. అన్యాస్త్రాలకంటె తనకు సూరి ప్రాణాలు విలువైనవి. అందుకని పోలీసుల కళ్లుగప్పడం నేరమని తెల్సి చేస్తున్నాడు. యూరేనియం, శత్రువులు తన కారులోనే వున్నారు. తనే స్వయంగా వారిని చేరవేస్తున్నాడు. అది మన్నించరాని నేరం!

అహమ్మద్ ఖాన్ కారు నాపమన్నాడు. సిత్రన్ ఆగింది.

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ యువరాజ్! మీ మేలు మేమెన్నటికీ మరచిపోలేము. ఒక డిటెక్టివ్ చేత తప్పించుకున్న ఘనత మాకు దక్కింది. మీరు వెళ్ళి సూరిని ఇక రక్షించుకోలేరు. కొందరి అసమర్థత మూలంగా మీబోటి డిటెక్టివ్ లు పేరుపొందతారు. మేము అసమర్థులం కాము. సూరి ఆ ఇంట్లో పెట్రోలు మంటలలో ఆహుతి అయిపో

తాడు. మీరు బ్రతికివుంటే మాకెన్నటికైనా ప్రమాదమే! మీరు సజీవంగా వుండకూడదు."

అంటూ అహమ్మద్‌ఖాన్ కారులో కూర్చుని వుండి పిస్తోలు యువరాజుకి గురిపెట్టాడు. ప్రేల్చడానికి ట్రిగ్గర్ నొక్కుతున్నాడు.

"బాస్! ఎవరో వస్తున్నారు," అన్నాడు ఖంగారుగా సియాంగ్. పేల్చడం ఆపాడు అహమ్మద్‌ఖాన్.

"ఆగాఖాన్! ఇక్కడ జనసంచారముంది. ఇదే అదను. నువ్వు సైనేడ్ విషాన్ని యువరాజుకి ఇంజెక్షన్ చెయ్" ఆజ్ఞయిచ్చాడు అహమ్మద్‌ఖాన్.

యువరాజ్ గుండెలు ఝల్లుమన్నై. వాళ్ళెంతటి కిరాత కులో బోధపడిపోయింది. సూరిని, తనని ఇరికించి తప్పించు కున్న శత్రువుల దృష్టిలో తాము తృణప్రాయులు.

"ఇది చాలా అన్యాయం. మీరు చెప్పినట్టు చేశాను. నన్ను చంపడం మీ మానవత్వానికి విరుద్ధం" ప్రాథేయ పడ్డాడు యువరాజ్.

"డిటెక్టివ్ పగబట్టిన త్రాచుతో సమానం. పరిస్థితుల ప్రాబల్యం మూలంగా మీరు లొంగారు. మిమ్మల్ని ప్రాణా లతో వదిలితే మాకు డేంజర్!" అన్నాడు అహమ్మద్‌ఖాన్.

ఇంతలో ఆగాఖాన్ సిరెంజిని తీసుకున్నాడు. యువరాజ్ భుజంమీదకు వంగాడు.

భుజంమీద చురామన్నది. సైనేడ్ అనబడు భయంకర విషం, తన రక్తంలోకి ప్రవేశించిందని తెల్సు. ఒళ్ళంతా ఓ మాదిరిగా జిల్‌మన్నది. ప్రాణాలు పోతున్నవని గ్రహించు కునే లోపు యువరాజ్ తల వాల్చేశాడు.

9

సూరికి వెలిగే మైనపు వత్తిని, తలుపులకు అన్చివున్న

పెట్రోలు డబ్బాను చూస్తూంటే పై ప్రాణాలు పైనే ఎగిరి పోతున్నై.

ఎవరైనా తలుపులు నెట్టారంటే డబ్బా గుమ్మరించుకుంటుంది. పెట్రోలు మైనపు వత్తిగుండా వచ్చి తనని చుట్టేసుంది. తను సజీవంగా దహనమై పోతాడు.

ఎలా తప్పించుకోవడం? యువరాజ్ వస్తాడా? శత్రువులు ఆయనను వదులుతారా? ఆయన వచ్చి తనని రక్షించగలడా? ఆయన వచ్చేలోపు ఎవరైనా తలుపులు నెట్టితే తన గతేం కాను!

గుండెలు దడదడ లాడి పోతున్నై.

మైనపు వత్తిని నోటితో వూది సూరి ఆర్పగలడు. కానీ దుర్మార్గులు సూరి నోటిలో గుడ్డలుకుక్కి ఉన్నారు. నోటితో వెలిగే వత్తిని వూది ఆర్పలేడు.

ముక్కు గాలితో దీపాన్ని ఆర్పాలని ప్రయత్నించాడు సూరి. నోటితో వదలు గాలికంటే ముక్కుతో వదులు గాలికి వేగం తక్కువ. ఆ వత్తి ఆరదు. ఆరలేదు. మైనపు వత్తి అడ్డంగా పడి వెల్లడం మూలంగా కరిగిన మైనం నేలమీదకు ప్రాకిపోయి వత్తి పెద్దగా మండుతూంది.

ముక్కు నుండి గాలిని యెంత బలంతో విడిచినా ఆరదని తేలిపోయింది.

ఆ మండే వత్తిమీదకు దొర్లాలనిపించింది. సూరి దొర్లడానికి ప్రయత్నించాడు. సాధ్య పడలేదు. చేతులు కాళ్ళను అతి భయంకరంగా విరిచి కట్టివున్నారు. ఎంత బలం కూడగట్టుకున్నా పార్లలేక పోతున్నాడు.

సూరి భయంతో తహతహలాడి పోతున్నాడు. తను చావడం ఖాయం? బెంబేలు పడిపోయాడు సూరి.

సూరి అటు యిటు ఎటూ కదలలేక పోతున్నాడు. దూరానికి దొర్లిపోవాలని శతవిధాలా ప్రాకులాడు తున్నాడు.

శరీరమంతా చెమటతో తడిసి పోతూంది. ప్రాణ భయంతో తల్లడిల్లి పోతున్నాడు.

చావునుండి తను బయట పడాలంటే ఏదో అతీతశక్తే కాపాడాలి. దైవాన్ని మ్రొక్కుకున్నాడు.

సూరి తన ప్రయత్నాన్ని విరమించుకోలేదు. వీలైతే మండే మైనపు వత్తిమీదకు దొర్లి ఆర్పాలి. లేదా దూరానికి_ అంటే_పెట్రోలు మంటలకు అందని దూరానికి దొర్లుకుంటూ వెళ్ళాలి.

అటు యిటు పొర్లడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ సమయంలో యెవరో వచ్చి తలుపులు తట్టడం విన్పించింది.

సూరి భయపడి పోయాడు. అరుద్దామంటే నోరు లేదు. మూల్గితే తలుపులు తట్టే మనిషి ఆదుర్దాపడి తలుపులు నెట్టేస్తాడు. ఎలా? ఎలా? సూరిలో ధైర్యం క్షీణించి పోతూంది. ఆశ సన్నగిల్లి పోతూంది. తలుపుల వంక చావు చూపులతో చూస్తున్నాడు.

తలుపులు నెట్టుతున్నారు. పెట్రోలు డబ్బా వంగుతూంది. మైనపువత్తి వెలుగుతూంది. సూరి నిర్వీర్యుడైపోయాడు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వున్న సూరి అల్లకల్లోలంలో పడి కొట్టుకులాడిపోయాడు.

అరవలేదు. మూల్గితే ప్రమాదం! అలాగే ఉంటే ప్రమాదం! తప్పించుకునే దెలా? తను చనిపోతాడు. పెట్రోలు మంటలు తనని చుట్టుముట్టి భస్మం చేసేస్తాయి.

తలుపులు నెట్టుతున్నారు.

పెట్రోలున్న డబ్బా వంగిపోయింది,

పడిపోయింది.__?

మొజాయిక్ ఫ్లోర్ మీద పడిన పెట్రోలు ఉరకలు వేస్తూ త్రుటిలో కమ్ముకు నేసింది.

10

తెలివి వచ్చింది. తెలివి వచ్చినట్టు గ్రహించగానే దిగ్గున లేచాడు యువరాజ్.

ఏమిటి? తను చనిపోలేదా? బ్రతికే వున్నాడా? సైనేడ్ విషం తనని చంపలేదా?

అసంభవం... సైనేడ్ తనకు ఎక్కించి వుంటే మరుక్షణం మరణించి ఉండేవాడు. మరయితే తనకు ఇంజెక్షను ఇచ్చిన మందేమిటి?

వళ్ళంతా బదకంగానూ, నొప్పులుగానూ వుంది. యువరాజ్ ఆలోచించాడు. తన శరీర పరిస్థితిని పట్టి తనకు మార్ఫియా ఇంజెక్షన్ యిచ్చివుండాలని వూహించాడు.

సైనేడ్ అంటూ మార్ఫియా ఇంజెక్షన్ ఎందుకు ఇచ్చారో బోధపడలేదు. పొరబాటు జరిగిందా? ఇంజెక్షన్ యిచ్చిన ఆగాఖాన్ సైనేడ్‌కు బదులు మార్ఫియా యిచ్చాడా?

యువరాజ్ తన కారులోనే సీటుమీద పడివున్నాడు. గబగబ దిగాడు. ఎదురుగా మహాసముద్రం దృశ్యమిస్తూంది. కనుచూపుమేర వరకు నీలిరంగుగల జలం అవుపడుతూంది. చుట్టు ప్రక్కల తిలకించాడు. అంతా అయోమయంగా వుంది. శత్రువులు అక్కడనుండి ఎలా తప్పించుకున్నారో అవగాహన కాలేదు. కానీ ఎలాగైతేనేం శత్రువులు తప్పించుకు వెళ్ళారు? తెల్సుకునేంత వరకు తను నిద్రించ కూడదు. పట్టుదల వహించాడు. ఇంతలో—

నూరి గుర్తుకు వచ్చాడు. గుండె లదిరాయి. నూరిని తను సజీవంగా చూడగలడా? ఆదుర్దా పడిపోయాడు యువరాజ్ ఆదరాబాదరా తన కారెక్కాడు. ముందుకురికించాడు.

లాలా బజార్ దగ్గరయే కొలదీ యువరాజ్ గుండె వేగం హెచ్చుతూంది. స్టిరన్ యువరాజ్ చేతిలో అల్లల్లాడిపోతూంది.

నూరికి ఎటువంటి ప్రమాదమూ సంభవించ కూడదని భగ

వంతుని ప్రార్థించు కుంటున్నాడు. కారాగింది. అక్కడ—

పోలీసులతో హడావుడిగా వుంది. ఫైర్ యింజన్లు గంటలు కొట్టుకుంటూ వచ్చి చేరుతున్నవి. సూరి ఉండిన యింట్లో నుండి మంటలు పొగలు మింటి కెగుస్తున్నవి.

యువరాజ్ స్థాణువై నిలబడి పోయాడు.

సూరి పెట్రోల్ మంటలలోపడి తగులబడి పోయి వుంటాడని తలుచుకోగానే యువరాజ్ కు కన్నీరు ఆగలేదు. తన ఊపిరితిత్తులతో సమానుడైన సూరి గతించాడా? బావురుమనేశాడు.

మంటలువచ్చు ఇంట్లోకి తెగించి దూరబోయాడు. ఇంతలో అప్పుడే అక్కడకు చేరుకున్న ధనార్జనరావు యువరాజ్ భుజం పట్టుకుని ఆపుతూ, "మీ రెందుకు వెళ్తున్నారు? ఏం జరిగింది?" అడిగాడు.

"సూరి ఆ మంటలలో చిక్కుకుని వున్నాడు. రక్షించాలి. నా సూరి మరణించ కూడదు" అంటూ ఆ యింట్లోకి దూరాడు.

పొగలు మంటలు క్రక్కు యింట్లోకి యువరాజ్ జొర బడడం చూస్తూన్న ధనార్జనరావు రాతి బొమ్మలా ఉండి పోయాడు. సూరి ఆ మంటలలో యెందు కుంటాడు? అర్థం కాలేదు.

యువరాజ్ అంతటి వాడు మంటలలోకి దూరగానే ధనార్జనరావ్ నిలబడలేక పోయాడు. ఫైర్ యింజన్లు నీళ్ళు చిమ్మడం, ధనార్జనరావు మంటలలోకి దూరడం ఏక కాలంలో సంభవించినై.

11

తలుపులు నెట్టడం సూరి గమనించగానే అలజడికిలోనై పోయాడు. పెట్రోలు డబ్బా పడిపోతుందని, పడగానే

కొవ్వొత్తిని తాకుతుంటూ తనని చుట్టుకుంటుందని తనుభస్మా డని తెలుచుకోగానే తన బలాన్నంతా కూడగట్టుకున్నాడు.

కొన్ని విపత్కర పరిస్థితులలో వెన్నెముకకు ఎక్కడ లేని బలం సమకూరుతుంది. ఈ విషయం ఆ తరువాత తెలుస్తుంది.

సూరి ప్రాణభయంతో వొక్క వూపుతో దొర్లాడు, పొర్లాడు. ఆ విసురుకు సూరి శరీరం రోలర్‌లా దొర్లుకుంటూ ఆవైపు గోడకు కొట్టుకుంది. అంతే...

తలుపులు నెట్టబడి డబ్బా పడగానే గప్పున పెట్రోలు అంటుకుంది. తృటిలో గదంతా మంటలతో నిండిపోయింది.

తలుపులు నెట్టినతను మంటలకు చావరుపు అరుస్తూ అల్లంత దూరంలో పడిపోయాడు. క్షణంలో తలుపులు భస్మమై పోయినై.

గది నిండుకు పొగలు! ఆక్సిజన్ కొరత ఏర్పడిపోయింది. సూరికి వూపిరి ఆడడంలేదు. మంటల నాలుకలు సూరినీ తాకుతున్నవి.

సూరికి తను బ్రతుకుతాడన్న నమ్మకం ఎప్పుడోపోయింది. నోటిలో గుడ్డలు కుక్కబడి వుండడం మూలంగా దవడలు నొప్పి పుడుతున్నై. చెమటలలో తడిసి ముద్దైపోయి వున్నాడు.

మంటలు అంతటితో ఆగక ఆ గదిలో వుండిన ఫర్నీచర్ నంతటినీ ఆవహించుకున్నై. గదంతా సెగలు... సెగలలో సూరి శరీరం వుడికిపోతూంది. సూరి శక్తి క్షీణించిపోతూంది.

ఆ సమయంలో___

సూరిని యెవరో అలాగ్గా ఎత్తుకుని భుజంమీద వేసుకుని మోసుకెళ్ళుతున్నారు. ఆ స్పర్శ తగలగానే సూరికి వెయ్యేనుగుల బలం పుంజుకుంది. తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. ఆ స్పర్శ తనని యెన్నో ఆపదల నుండి కాపాడినదే గాక,

తన జీవితానికి, జీవిత గమనానికి వజ్రకవచం!

12

"మిస్టర్ యువరాజ్! మీరు చేసింది తప్పనిగానీ పొరపాటని గానీ చెప్పక నేరమంటున్నాను. శత్రువులు మీకు తెలియ జేయగానే పోలీసులకు చెప్పవల్సిన బాధ్యత గలవారు," అని రుసరుసలాడాడు ఐ. జి.

"అవును. అప్పటిలో మీరన్నట్టు బాధ్యతను నేను చేసి వున్నట్టయితే ఈ నగరం, నగరంలో వున్న మనం ఈ పాటికి వాయువురూపమై గగనంలో ఉండేవాళ్ళం. అన్నీ యోచించి అలా చేశాను," యువరాజ్ వివరంగా విన్నవించాడు.

"అయితే యిపుడు శత్రువులు ఎక్కడున్నారు? బాంబులను ఎక్కడ దాచి వుంచారు? తెల్సుకునే దెలా? ఇతర దేశీయులు మన దేశంలో చేసిన ఈ సాహసానికి సిగ్గు చేటుగా ఉంది," అన్నాడు హోం మంత్రి.

"శత్రువులు యురేనియంతో పారిపోడానికి బీచ్ రోడ్ లో దిగడాన్ని గమనిస్తూంటే శత్రువులకు హిందూ మహాసముద్రంలో రాకెట్-స్థావరమో, జలాంతర్గమో వుండాలని వూహిస్తున్నాను" చెప్పాడు యువరాజ్.

"ఆ విషయం తెల్సుకునే దెలా?" అడిగాడు కమీషనర్.

"మన వైమానికదళ సిబ్బందికి ఆజ్ఞలు జారీ చేయండి. అలాగే మన నౌకాదళ సిబ్బందిని మేల్కొలపండి. హిందూ మహాసముద్రంలో ప్రతినీటి బొట్టునూ వెదకమని చెప్పండి," అన్నాడు యువరాజ్.

"అలాగే... ఆర్డర్స్ జారీ చేస్తాను" అంటూ హోం మంత్రి ఫోన్ అందుకున్నాడు.

"మిస్టర్ యువరాజ్! శత్రువుల స్థావరం బాంబులతో సముద్రగర్భంలో జాడ తెలియకపోతే శిక్షార్హులు అవు

తారు,'' హెచ్చరించాడు ఐ. జి.

"అలాగే...ఆ బాంబులను, శత్రువులను కనుగొనడానికి నా సర్వశక్తులూ ప్రయత్నిస్తాను,'' అంటూ లేచాడు యువరాజ్.

13

డిటెక్టివ్ యువరాజ్ భుజంగరావుకు ఫోన్ చేశాడు.

"భుజంగరావు గారూ! మీ భార్య దేవకి యింటికి వచ్చిందా?''

"లేదండి రాలేదు'' ఆందోళనతో చెప్పాడు భుజంగరావు.

యువరాజ్ ఆశ్చర్య చకితుడయ్యాడు. "రాలేదా!'' అంటూ రిసీవర్ పెట్టేశాడు.

"సూరీ! దేవకి యింటికి వెళ్ళక ఏమయింది? ఎక్కడికి వెళ్ళివుంటుంది?'' విసుక్కున్నాడు యువరాజ్.

"సార్! ఆమె యింటికి వెళ్ళక మనలను అనుసరించి వచ్చిందేమో?'' అన్నాడు సూరి.

"అలా అనుసరించి వచ్చివుంటే నాకు మార్ఫియా యివ్వగానే తెలివిలేని నా వద్దకు వచ్చి వుండాలిగా!''

"అందుకు ఆమెకు అవకాశం లభించి ఉండదు.''

"ఎందుకని?''

"శత్రువులను ఆమె వెన్నాడుతూ వెళ్ళిందేమో?''

యువరాజ్ అదిరిపడ్డాడు. మనసు పరిపరివిధాల పోయింది. సూరి సందేహంలో సత్యముంది.

"నిజమే సూరీ! నువ్వు వెంటనే బీచ్ రోడ్‌కు వెళ్ళు. దర్యాప్తు ప్రారంభించు. నువ్వన్నట్టే దేవకి శత్రువుల వెన్నంటితే శత్రువుల ఆచూకీ లభించవచ్చు.''

సూరి బయటకి వెళ్ళిపోయాడు.

తనని మోసంచేసి తప్పించుకున్న శత్రువులు సముద్రంలో వెళ్ళి వుంటే నౌక మీదనే వెళ్ళి వుండాలి. ఆలోచించ సాగాడు.

టెలిఫోన్ అదిరిపోతూ మ్రోగింది. రిసీవ్ చేసుకున్నాడు యువరాజ్. "హల్లో" అన్నాడు.

"ఏమండీ దేవకిని మాట్లాడుతూంట."

యువరాజ్ గుండెలు ధమధమ లాడాయి.

"ఏమిటి విశేషాలు?" ఆత్రంగా అడిగాడు.

"మీరు వెంటనే హోటల్ డీలక్స్, నెంబరు అరవై కదికి మారువేషంలో, అతిరహస్యంగా వచ్చి కల్సుకోండి. వివరాలు చెప్తాను," అంటూండగానే ఫోన్ క్లిక్ మన్నది.

యువరాజ్ ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది.

మేకప్ రూములో నుండి క్షణంలో బయటపడ్డాడు. డిక్టో ఫోన్ ఆన్ చేశాడు.

"సూరీ! దేవకి డీలక్స్ హోటల్, నెంబరు అరవైకి రమ్మని ఫోన్ చేసింది. ఏవో విషయాలు చెప్తానన్నది. వెళ్తున్నాను. నువ్వు రాగానే నేర్పుగా అక్కడ కొచ్చి నన్ను కల్సుకో. నేను లేకుంటే, అక్కడి పరిస్థితులబట్టి తెలియ జేయడానికి ప్రయత్నిస్తాను. బి కేర్ ఫుల్!" అని రికార్డ్ చేశాడు. బయాలుదేరాడు. గుండెలు అతివేగంగా కొట్టుకుంటున్నవి.

14

డిటెక్టివ్ యువరాజ్ హోటల్ డీలక్స్‌కు అతి సులభంగానే చేరుకున్నాడు.

శత్రువులు తనని ఒక కంట కనిపెడ్తూన్నారేమో లోలోన జంకుగానే వుంది. అతి జాగ్రత్తగా మసలు కుంటున్నాడు. తనలోని ప్రతి కదలికనూ సహజత్వం వుట్టిపడేలా నడుస్తూ, సందేహం కల్గని రీతిగా అడుగులు వేస్తున్నాడు.

అరవై నెంబరు గది ముందుకు చేరుకున్నాడు. అటు ఇటు చూశాడు. ఎవరూ లేరని నమ్మకం కుదిరింది. మెల్లగా తలుపులు తట్టాడు.

యువరాజ్ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నై. తనకి ఫోన్ చేసింది దేవకేనా? దేవకి ఫోన్ చేయడం శత్రువులు పసిగట్టి వుంటే తనకి ప్రమాదం! తను అప్రమత్తుడై వుండాలి.

జేబులోని పిస్తోలును తడుముకుంటూ మళ్ళీ తలుపులు తట్టాడు.

లోపల తలుపులు తీయు సవ్వడి వినబడింది. తలుపులు తెరుచుకున్నవి. యువరాజ్ ఆత్రుతగా చూసాడు.

ఎదురుగా దేవకి నిలబడి వుంది. తనని బంధించడానికి శత్రువులు దేవకిని అడ్డంగా పెట్టుకుని ఏదైనా పన్నాగం పన్ని వున్నారేమో! ఆమె ముఖకవళికలను బట్టి గ్రహించడానికి సునిశితంగా చూశాడు.

"ఎవరు?" కరుగ్గా ప్రశ్నించింది దేవకి.

"నేనే!" చెప్పి నవ్వాడు యువరాజ్.

యువరాజ్ మారువేషంలో వుండడం మూలంగా దేవకి గుర్తించలేక పోయింది. అతి మెల్ల గొంతుకతో 'యువరాజ్' అన్నాడు.

దేవకి తప్పుకుంది. యువరాజ్ లోపలకు అడుగు పెట్టాడు. తలుపులు మూసేసింది.

"మీరా! గుర్తించలేక పోయాను. రండి," అంటూ దేవకి బాత్ రూం వైపు దారి తీసింది. ఆమె బాత్ రూమ్ వైపు వెళ్ళడం యువరాజ్ కు అయోమయం అయిపోయింది. దేవకి బాత్ రూము తలుపులు తెరిచి లోపలకు అడుగు పెట్టింది. యువరాజ్ తటపటాయించాడు.

"రండి!" నవ్వుతూ అన్నది దేవకి. ఆ నవ్వులో వెకిలి చేష్టలకు తావు లేదు. యువరాజ్ గ్రహించి బాత్ రూం

లోకి జడుస్తూనే అడుగు పెట్టాడు. దేవకి తలుపులు మూసేసింది.

"యువరాజ్ గారూ, మీరు గదిలోకి రావడం ఎవరైనా చూశారా?" ఖంగారుగా అడిగింది దేవకి.

"చూచి ఉండరనే నా నమ్మకం!"

"నమ్మకం వుంటే ఫరవాలేదు. శత్రువులు అతి భయంకరులుగా ఉన్నారు. అందుకని మనం మాట్లాడుకోడానికి బాత్ రూముని ఎన్నుకొన్నాను. ఇపుడు బయట ఎవరైనా వచ్చినా నేను వెళ్తాను. అనుమానం కల్గదు," చెప్పిండి దేవకి.

ఆమె సమయస్ఫూర్తిని మెచ్చుకోకుండా వుండలేక పోయాడు. "ఏం జరిగింది? చెప్పబోయేదేమిటో చెప్పండి," అన్నాడు యువరాజ్.

"మీరు మావారి వద్దకు నన్ను ఇంటికి వెళ్ళమని మీ కారెక్కి బయలుదేరారు. నేను మా ఇంటికెళ్ళక ఒక టాక్సీలో మీ కారుని అనుసరించాను. లాలా బజార్‌లో దిగి నేను మీరున్న ఇంట్లోకి వస్తే నాకో, మీకో ప్రమాదం సంభవిసుందని అలాగే వుండిపోయాను. కాసేపటికి కొందరు వ్యక్తులతో మీరు రావడం చూశాను. మీ కారుని మళ్ళీ అనుసరించాను. బీచ్ రోడ్‌లో ఆగింది.

శత్రువులందరూ దిగి ఆదరాబాదరా సముద్రం వైపు వెళ్ళడం గమనించాను. మీరు ప్రాణాలతో వున్నారో, తెలివితప్పి వున్నారో నేనపుడు ఆలోచించలేదు. శత్రువులు ఎటు వెళ్ళుతారో చూడాలని తాపత్రయ పడిపోయాను. ఆ లక్ష్యంతోనే వారిని వెంబడించాను. వాళ్ళు మొత్తం నలుగురు వ్యక్తులున్నారు. నలుగురిలో ముగ్గురు పడవను ఎక్కారు. పడవ సముద్రంలోకి ఉరికి ప్రయాణం కొనసాగించింది. ఒకతను తిరిగి వచ్చాడు. ఈ హోటల్ చేరు

కున్నాడు,'' చెమటలు తుడుచుకుంది దేవకి.

"ఎవరతను? ఎక్కడున్నాడు?'' అడిగాడు యువరాజ్.

"ఈ హోటలులోనే ఉంటున్నాడు. ఇక్కడికి ఈ రోజు కొందరు నిపుణులు వచ్చారు. ఏ విషయంలో నిపుణులో నాకు తెలియదు. ఆ నిపుణులకు వినోదం, విలాసం, అందించడానికి ఇద్దరు స్త్రీలు కావల్సి వచ్చింది. అందుకు నేనెన్నో తంటాలుపడి నా శరీర అవయవాలను, వాక్చాతుర్యాన్ని ఉపయోగించి ఎన్నుకోబడ్డాను. ఈ రాత్రికి అందరూ బయలు దేరుతున్నారు. ఎక్కడకు వెళ్ళుతారో నాకు తెలియదు. నా వూహా... తప్పక బాంబులున్న చోటుకేనని అనుకుంటున్నాను. అందుకే మిమ్ములను పిలిచాను,'' చెప్పింది దేవకి.

"ఇక్కడకు వచ్చిన నిపుణులుఎవరెవరో మీకు తెల్సా?'' అడిగాడు యువరాజ్.

"తెల్సు. రాత్రి వారి ముందు కేబరే, స్ట్రిప్ సీజ్ డాన్సులు ఆడి మెప్పించాను. నా శరీరపు ఒంపులతో వెఱ్ఱి ఎత్తించాను,'' ఆమె జంకూ గొంకూ లేకుండా, సిగ్గూ ఎగ్గూ లేకుండా చెప్పింది. దేవకి పూర్తిగా మనోవికారాలకు లోనైవుంది. తన భర్త తయారుచేసిన బాంబులను చేజిక్కించుకోడానికి దేవకి దేనికైనా సిద్ధంగా వుంది. ప్రతి పనిలోనూ వుత్సాహం చూపుతూ ఆత్రుత కనబరుస్తూంది.

ఇంతలో బయట ఎవరో తలుపులు తట్టిన చప్పుడైంది.

"ఎవరో వచ్చారు'' ఖంగారుగా అన్నది దేవకి.

"ఖంగారు పడకండి. శత్రువుల మనిషైనా, ఎవరైనా వచ్చివుంటే ఈ బాత్ రూములోకి జాగ్రత్తగా తీసుకు రండి,'' చెప్పాడు యువరాజ్.

ఆమె కేదో అర్థమైనట్టయింది. వచ్చిన వ్యక్తి శత్రువుల వాడైతే యువరాజ్ ఏదో చేస్తాడని వూహించింది. దేవకి గబగబ తన ఒంటి మీదున్న బట్టలను నూలుపోగు లేకుండా

వూడ బెరుక్కుంది. ఆ బాత్ రూములో యువరాజ్ వున్నా డన్న విషయం తెల్సినా గుర్తించే స్థితిలో లేదామె!

ఆమె శరీరం ఏదో కాంతితో మెరిసి పోతూంది. ఆమె శరీర అవయవాలు నిండుగా వుండి వుద్రేకం కల్గిస్తున్నవి.

ఆమె యువరాజ్ ముందు సిగ్గుపడలేదు. నగ్నంగా వున్న దేవకి గబగబా టబ్ వరకెళ్ళింది. టబ్‌లో వున్న నీటిలో ఒక్క బుటక వేసి మునిగింది. లేచి నిలబడింది.

కొక్కానికి వ్రేలాడుతున్న టర్కీ టవల్ని అందుకుంది. తన పిరుదుల చుట్టూ చాలీ చాలక చుట్టుకుంది. కాస్త గుడ్డను తన రొమ్ములను కప్పి పుచ్చడాని కన్నట్టు అడ్డం పెట్టుకుంది.

యువరాజ్ విచిత్రంగా నిలబడి తిలకిస్తున్నాడు.

దేవకి తడి శరీరంతో, "ఏమండి, మీరు ఆ మూల దాక్కోండి. వచ్చినవాడు శత్రువులోని మనిషైతే తప్పక పిలుచుకు వస్తాను. వాడు బాత్ రూంలోకి అడుగు పెట్టగానే, ఆ తరువాత బాధ్యత మీది," చెప్పింది అతిమెల్లగా.

యువరాజ్ మూల నక్కాడు. దేవకి కొద్దిగా తలుపులను తెరిచింది. "యస్ కమిన్!" అన్నది.

బయట తలుపులు తెరచి ఎవరో లోపల ప్రవేశించినట్టు అడుగుల చప్పుడు యువరాజ్‌కు వినబడింది.

వచ్చినతను దేవకి శరీరాన్ని చూసి చిత్తై పోయాడు. నోరు తెరిచి, కళ్ళు పెద్దవి చేసి నిలబడగానే అతనిలో వేడి పెరిగింది. నరాలు జివ్వుమన్నవి.

అది గ్రహించిన దేవకి తను నగ్నంగా వున్నానని తొందరపడి బాత్ రూములో నుండి వచ్చినట్టు దొంగసిగ్గును ప్రదర్శిస్తూ - ఆ సిగ్గులో యింకా రెచ్చగొట్టు తనాన్ని చూపింది.

"ఐయామ్ వెరివెరి సారీ!" అన్నది దేవకి అలా నిలబడే, టవల్ని జారుస్తూ అవయవాలను కనబడునట్టు చేస్తూ.

వచ్చినతనిలో నిగ్రహం పోయింది. అమాంతం దేవకిని చుట్టేయాలనుకున్నాడు. అది పసిగట్టిన దేవకి అతని దగ్గరగా వెళ్ళింది. అతని కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూసింది. అంతే—

అతను ఆగలేక పోయాడు. దేవకిని చుట్టేశాయి అతని చేతులు. దేవకి టర్కీ టవల్ని వదిలేసింది. నగ్నంగా అతని బాహువుల్లో యిమిడి పోయింది. అతను ఆమె శరీర స్పర్శను పూర్తిగా ఆనిస్తేపోయాడు.

"ఇక్కడొద్దు. బాత్ రూములోకి వెళ్ళుదాం. ఎవరైనా మీ వాళ్ళల్లోనే రావచ్చు," తియ్యగా చిలక పలుకులు పలికింది.

అతను మంత్రముగ్ధుడిలా తలూపాడు. దేవకి అతని నడుం చుట్టూ చేయివేసి సోయగాలతో బాత్ రూము వైపు నడిపించింది.

ఇద్దరూ బాత్ రూములోకి అడుగు పెట్టారు. దేవకి అతనిని కసిగా అన్నట్లు వాటేసుకుంది. అతను అదుముకున్నాడు. దేవకి అతని వీపుని యువరాజ్ వున్న వైపుకి మళ్ళించింది. యువరాజ్ క్షణమూ ఆలస్యము చేయలేదు. ఏం చేయాలో అదే చేసేశాడు. అతను దేవకి బాహువుల్లోనే తల వాల్చేశాడు. అతని భారీ శరీరాన్ని దేవకి మోయలేక పోయింది. యువరాజ్ సహాయ మందించాడు. "దేవకీ! ముందు బట్టలు వేసుకో." అంటూ ఆ వ్యక్తిని పడుకో బెట్టాడు యువరాజ్. దేవకి చకచక వళ్ళు తుడుచుకుని, బట్టలు వేసుకుంది.

క్రింది పడ్డతని జేబులను చకచక వెతికాడు యువరాజ్, కొన్ని కాగితాలు దొరికినవి. గబగబ చూశాడు. అతని పేరు సాదత్ అని తెల్సుకున్నాడు.

వెంటనే ఓ నిశ్చయానికి వచ్చాడు యువరాజ్. బుజే లోంచి రెడ్ పెన్సిల్ తీసి బాత్ రూం తలుపుమీద ఇంటు

మార్కు పెట్టాడు. ఇంటు మార్కుమీద ప్లస్ గుర్తు పెట్టాడు. పక్కగా యారో మార్కు గీశాడు. యారో కొదురుగా అంగ్లంలో Sea అని వ్రాశాడు. ఆ గుర్తు చాలు. సూరి గ్రహించగలడని యువరాజ్ కి ధైర్యం కలిగింది.

15

రాత్రి పదిగంటలకు టిక్కాఖాన్ గదికొచ్చి పిలిచాడు. యువరాజ్ బయలుదేరాడు. అందరూ హాలులో కలుసుకున్నారు.

మొత్తం ఆర్గురు అయ్యారు. టిక్కాఖాన్, నిపుణులతో కలిసి నల్గురు. యువరాజ్, దేవకిలు యిద్దరు. మరో యువతి ఏమయింది? బహుశ రద్దుచేసి వుండొచ్చని యువరాజ్ తలచాడు.

ఆరుగురు ఆవరణలోకి అడుగుపెట్టారు. ఒక టాక్సీ ఆగి వుంది. అందరూ ఎక్కారు. బయలుదేరింది టాక్సీ. అంతవరకు తనని ఎవరూ గుర్తించనందుకు సంతోషించాడు యువరాజ్.

బీచ్ రోడ్ లో అందరూ దిగారు. టాక్సీ వెళ్ళిపోయింది. ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగావుంది. సముద్రపు ఘోష స్పష్టంగా వినబడుతూంది. గాఢాంధకారమయంగా వుంది. ఏమీ కనిపించడంలేదు.

దిగిన వారంతా యిసుకలోపడి సముద్రంవైపు నడవడం ప్రారంభించారు. ఒక పడవవద్ద ఆ చీకటిలో యిద్దరు వ్యక్తులు నిలబడివున్నారు. వాళ్ళు ఈ ఆరుగుర్ని ఆహ్వానించారు. అందరూ కల్సి పడవను నీటిలోకి నెట్టారు.

అందరూ పడవలోకి ఎక్కారు. పడవ ప్రయాణం కొనసాగించింది.

ఆ పడవకు అడుగు భాగంలో శక్తివంతమైన ఇంజన్ వుందని యువరాజుకు వెంటనే తెల్సిపోయింది. యంత్రశక్తి మూలంగా ఆ పడవ అలలకు ఎదురుగా వేగాన్ని పుంజుకుంది.

దేవకి యువరాజ్ ప్రక్కనే కూర్చునివుంది. ఆమె జీవచ్ఛవంలా గుంది. అవును. నడిరేయి. చిట్టచీకటి. గంభీరమైన సముద్రంమీద ప్రయాణం. పైగా శత్రువులమధ్య. ఆమెకు అగ్నిజ్వాలల మధ్య వున్నట్టుంది.

పడవ సముద్రంలోకి చొచ్చుకుపోయే కొలది అందరూ భీతావహులై పోతున్నారు.

ఎంతటి ధైర్యవంతుడైనా ఆ పరిస్థితిలో భయపడక తప్పదు. చీకటిలో సముద్ర ప్రయాణం వింతగా వున్నా భయంకరంగా వుంది. పైన నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నవి. అందరూ అరచేతులలో ప్రాణాలు పట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఎంతసేపు, ఎంతదూరం వెళ్ళాలో...??

పడవను నడపు ఇద్దరూ చకచక ఏదేదో చేస్తున్నారు. పడవ మధ్య భాగంలో పెద్ద యిరుసును నిలబెట్టి బిగిస్తున్నారు. యువరాజ్ వింతగా వాళ్ళను, వాళ్లు చేసేపనిని చూస్తున్నాడు.

ఇరుసుని నిలబెట్టి బిగించడం పూర్తయింది. ఆ ఇరుసుకు పై భాగంలో పొడుగుపాటి రెక్కలను అమర్చారు. గట్టి పరచారు. ఇపుడు ఆ రెక్కలు హెలికాప్టర్ కుండు ప్రొఫెల్లరలాగున్నవి. ఇంజనుని ఆపి ఏదో చేశారు.

ప్రొఫెల్లర్స తిరగడం ప్రారంభించాయి. స్పీడందుకుంది. హోరు ఎక్కువయింది.

ఆ పడవ హెలికాప్టర్ లా పైకి లేచినట్టు లేచింది. అందరూ ఆశ్చర్యచకితులై పోయారు. నీటినుండి పైకి లేచిన పడవ పదడుగుల ఎత్తుకు వచ్చింది. ఆ ఎత్తుకంటె పైకి లేవలేదు. సముద్ర జలాలకు పదడుగుల ఎత్తులోవుండి ప్రయాణం ప్రారంభించింది.

యువరాజా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

ఆ ప్రయాణం విచిత్రంగా వుంది. సముద్రంమీద జలా

అడు పదడుగుల గగనంలో వుండి ప్రయాణించడం విచిత్రమే మరి. ఆ పడవ పనితనానికి మెచ్చుకోకుండా వుండలేక పోయాడు. చూపుకు పడవలావున్నా హెలికాప్టర్‌లా పయనిస్తూంది. దాని తయారీ అత్యద్భుతం. చెట్లో, కొండలో, గుట్టలో అడ్డంవస్తాయన్న సంశయమేలేదు. దూరానికి పడవ పయనించినట్టే కనబడుతుంది.

సముద్రపు నీటికి పదడుగుల దూరంలో వుండి, వుపరితలం మీద శరవేగంతో దూసుకు వెళ్లుతూంది. అందరూ మౌనంగా వున్నారు.

తూర్పుదిక్కున అరుణ రేఖలు కన్పడేంతవరకు పడవ ప్రయాణిస్తూనే వుంది. ఎటుచూచినా సముద్రమే గోచరిస్తూంది. నీలాకాశం, సముద్రంమీది కెరటాలు. పరిస్థితులు భయానకంగా వున్నై.

పడవ స్లీపేన్‌లా జలాలను చీల్చుకుంటూ నీటిమీద ఆగింది.

పడవ నడిపినవారు ఏదో సాధనాన్ని నొక్కడం యువరాజ్ చూశాడు. ఆ సాధనం కిక్ కిక్ మన్నది.

దేనికోసమో ఎదురు చూస్తున్నారు. అపుడు—

సముద్ర గర్భంలోనుండి ఒక పెద్ద స్తంభం లాటిది పైకి పుట్టుకొచ్చింది. ఆ స్తంభాన్ని చూచిన దేవకి హడలిపోయి కెవ్వుమని కేక వేసేసింది. యువరాజ్ ఆమెను అభయంతో హత్తుకున్నాడు. అందరూ సముద్రంలోనుండి పుట్టుకొచ్చిన స్తంభాన్ని చూచి భయపడకుండా వుండలేకపోయారు.

ఆ స్తంభానికి ప్రక్కగా వెళ్ళి పడవ ఆగింది. స్తంభం నుండి తలుపులాటిది తెరుచుకుంటూ పడవమీద వాలింది.

టిక్కాఖాన్, "కమాన్," అంటూ పిలిచి పడవమీద వాలిన చెక్కమీద నడుస్తూ స్తంభంలోపలికి జారబడి పోయాడు.

అందరూ అనుసరించారు. అందరూ స్తంభంలోపలికి చేరుకునేశారు. ఇపుడు తలుపులు మూసుకున్నవి. సముద్రం లోపలకు స్తంభం మళ్ళీ మునిగిపోయింది.

అక్కడ ఆగిన పడవ తిరుగ ప్రయాణం ప్రారంభించింది.

16

సాగర గర్భంలోకి మునిగిన స్తంభం జలాంతర్గామిని చేరుకుంది. అందరూ జలాంతర్గామిలోకి అడుగుపెట్టారు.

అహమ్మద్ ఖాన్, ఆగాఖాన్, సియాంగ్ యింకా ఇతర సిబ్బంది వున్నారు లోపల. అందరూ వారిని సాదరంగా ఆహ్వానించారు. దేవకిని ఆవురావురుమని చూశారు అక్కడున్న వారంతా.

ఆ జలాంతర్గామిలో రాకెట్లను ప్రయోగించబడుగొట్టాలు ఇంకా యితర యంత్ర పరికరాలు చూస్తూంటే యువరాజుకు ముచ్చెమటలు పట్టినై.

ఆ జలాంతర్గామి దాదాపు వంద అడుగుల లోతునవుంది. అక్కడక్కడ అద్దాలున్నవి. అద్దాలగుండా సాగర గర్భ జలం గోచరిస్తూంది.

అక్కడున్న రాకెట్లను చూస్తూంటే చైనాలో తయారైనవని స్పష్టంగా తెలుస్తున్నవి. ఇపుడు చైనా రాకెట్ల స్థావరాలను చాలా నిర్మించి వున్నదని యువరాజుకు తెల్సు. చైనా పాకిస్తాన్ కల్సి సాగర గర్భంలో రాకెట్ స్థావరం నిర్మించారని వూహించాడు.

అపహరించిన బాంబులు ఆ వైపుగా పెట్టబడివున్నై ఆ బాంబులను చూస్తూంటే యువరాజుకు వణుకు పుట్టిపోతూంది. ఆ బాంబుల శక్తి యువరాజుకు బాగా తెల్సు.

ఆ బాంబులను నిపుణుల సహాయంతో రాకెట్లలో అమర్చుతారు. అయితే రాకెట్లను ఏదేశం మీదకు ప్రయోగిస్తారు?

అక్కడి పరిస్థితులు గ్రహిస్తూంటే తను ప్రాణాలతో బ్రతికి బయటపడగలనన్న నమ్మకం యువరాజుకు పోతూంది.

జలాంతర్గామిలోకి చేరుకున్న నిపుణులకు ఏవో పానీయాలు అందివ్వబడ్డాయి. అందరూ సేవించారు. ఖాళీగ్లాసులను క్రింద పెట్టారు. ఆశ్చర్యం.

ఆ గ్లాసులకు ఎవరో వచ్చి వ్రేలి ముద్రలను తెల్సుకోడానికి ఏదో పౌడరు చల్లాడు. లోపలకు తీసుకెళ్ళాడు. యువరాజ్ గడగడా వణికిపోయాడు.

నిపుణుల వేలిముద్రలు అంతకుముందే జలాంతర్గామిలోకి చేరివున్నవి. ఆ వేలిముద్రలతో, ఇప్పుడు తీసిన వేలిముద్రలను పోల్చి చూస్తారు. తప్పక సాదత్ వేలిముద్రలు కావని గ్రహించి తనని అనుమానిస్తారు.

అహమ్మద్ ఖాన్ గబగబవచ్చి యువరాజ్ ముందు నిలబడ్డాడు. "ఎవరు నువ్వు?" అని కోపంగా గర్జించాడు.

యువరాజ్ కు ముచ్చెమటలు పోశాయి. నిబ్బరించుకున్నాడు. "సాదత్ ని" తొణకకుండా చెప్పాడు.

"కాదు. సాదత్ వేలిముద్రలకు, నీ వేలిముద్రలకు చాలా తేడావుంది. నువ్వు సాదత్ వి కాదు!" అరిచాడు అహమ్మద్ ఖాన్.

"నేను సాదత్ నే!" బుకాయించాడు యువరాజ్. తనిక తప్పించుకోలేడు. వాళ్ళను నమ్మించలేడు. అక్కడున్న వారంతా యువరాజ్ ని విచిత్రంగా చూస్తున్నారు.

"మిస్టర్! బుకాయించి లాభంలేదు. మేము మోసపోకూడదనే మా ఏర్పాట్లను కొనసాగించాం," అంటూ అహమ్మద్ ఖాన్ యువరాజ్ ముఖంమీద ఏదో ద్రవంచల్లాడు. ఆశ్చర్యం! యువరాజ్ ముఖంమీదనుండి రంగు ధారగా కారుతూంది. అయిదారుగురు కల్సి యిరికించి పట్టేశారు. ఒకడు యువరాజ్ ముఖంమీదున్న రంగుని తుడిచాడు.

"మెగాడ్ యువరాజా!!! మీరు చావలేదా...!" ఆశ్చర్యాన్ని అణచుకోలేక అహమ్మద్ ఖాన్, "ఆగాఖాన్!"అని అరిచాడు బిగ్గరగా.

ఆగాఖాన్ బిత్తర చూపులతో అయోమయంగా నిలబడ్డాడు. "ఏమిటిది?" ఉరిమాడు అహమ్మద్ ఖాన్ యువరాజ్ ని చూపుతూ. ఆ చూపులో సైనేడ్ మూలంగా యువరాజ్ ఎలా బ్రతికాడన్న ప్రశ్న వుంది.

"ముందుగా మనం యువరాజ్ కు మార్ఫియా యివ్వాలనే అనుకున్నాం. ఆ తరువాత సైనేడ్ యివ్వాలని నిర్ణయించాం. నేను పొరబాటున సైనేడ్ కు బదులు మార్ఫియా యిచ్చినందుకు చింతిస్తున్నాను బాస్. క్షమించండి" ప్రాధేయపడ్డాడు ఆగాఖాన్.

"ఆగాఖాన్! నీ సర్వీసులో యిదే ప్రథమ పొరబాటు. అయినా ఫరవాలేదు. ఈ యువరాజ్ ఈ సముద్రంనుండి బ్రతికి బయట పడలేడు" అహమ్మద్ ఖాన్ గర్జించాడు. ఇరువురు వ్యక్తులు వచ్చి యువరాజ్ ను కదలకుండా పట్టుకున్నారు.

17

సూరి డీలక్స్ హోటల్ చేరుకున్నాడు. పరిస్థితి గుర్తించాడు. ఇన్ స్పెక్టర్ కు ఫోన్ చేశాడు.

ఆదరాబాదరా ఇన్ స్పెక్టర్ ధనార్జనరావు హోటల్ డీలక్స్ చేరుకుని సూరిని కల్సుకున్నాడు. సూరి, ధనార్జనరావు కల్సి సాదత్ ని బంధ విముక్తుణ్ణి చేసి, అరెస్ట్ చేశారు.

"ఎవరు నువ్వు?" ప్రశ్నించారు సాదత్ ని.

"పాకిస్తాన్ కు చెందినవాణ్ణి. నన్ను ఇండియా చేరుకొమ్మని ఆర్డర్ వచ్చింది. నేను ఒక సైంటిస్టుని. ఇక్కడకు చేరుకున్నాను. నన్ను టిక్కాఖాన్ అనునతడు కల్సుకున్నాడు.

ఈ రాత్రికి వెళ్ళాలని చెప్పాడు. ఎక్కడికైనది నాకు తెలియదు," చెప్పాడు సాదత్.

ఇంకా ఎన్నో విధాల ప్రశ్నించి చూశారు. క్రొత్త విషయాలు సాదత్ చెప్పలేకపోయాడు.

"ఇపుడు కర్తవ్యం ఏమిటి?" అడిగాడు ధనార్జనరావ్.

"ఐ. జి. ని, హోం మంత్రిని కల్సుకోవాలి."

"ఎందుకు?"

"చెప్తాను. రండి," అంటూ సూరి బయలుదేరాడు. సాదత్ ని పోలీసులకు అప్పగించి, ధనార్జనరావూ బయలుదేరాడు.

హోం మంత్రిని, ఐ. జి. ని, కల్సుకున్నారు.

"సార్! యువరాజ్ గారు శత్రువులలో కల్సిపోయి సముద్రంలోకి వెళ్ళి వున్నారు. సముద్రంలో ఎక్కడో శత్రువులు స్థావరం ఏర్పరుచుకుని వున్నారు. యువరాజ్ కు ప్రమాదం. పైగా భుజంగరావు తయారుచేసిన బాంబుల మూలంగా మనకు ఏ క్షణాన్నైనా ప్రమాదం సంభవించవచ్చు" అన్నాడు సూరి.

"ఇపుడేం చేయమంటావు?"

"మీరు నౌకాదళానికి, వైమానికదళానికి ఆదేశాలు యివ్వాలి. సముద్రాన్ని గాలించాలి" చెప్పాడు సూరి.

"కేవలం ఒక ప్రయివేట్ డిటెక్టివ్ ఆలోచన ప్రకారం ఈ నగరాన్ని అల్లకల్లోల పరచి వున్నాం. యురేనియం మూలంగా నగరానికి ముప్పు అని భీతిగొలిపారు. ఇపుడు దేశానికి ముప్పు అని, యువరాజ్ కు అపాయమని సముద్రాన్ని గాలించడం సిగ్గుచేటు," విసుక్కున్నాడు ఐ. జి.

"అలా అనకండి. కొన్ని పరిస్థితుల దృష్ట్యా నేను దూఢిగా చెప్పగల్గుతున్నాను. యువరాజ్ సముద్రంలోకి వెళ్ళి వున్నారు గనక శత్రువుల స్థావరం సాగర గర్భంలో

ఉండి తీరుతుంది."

"లేకుంటే?"

ధనార్జనరావు కలగజేసుకుని బంధితుడైన సాదత్ గురించి చెప్పాడు. అందరికీ నమ్మకం కలిగింది. వెంటనే అడ్మిరల్ ఛటర్జీకి, ఏర్ మార్షల్ అరుజన్ కు వార్తలు పరుగులు తీశాయి.

సూరి, ధనార్జనరావులు ఏరోడ్రోముకు బయలుదేరారు.

"మనం తెల్సుకో గలమా?" అడిగాడు ధనార్జనరావ్.

"తెల్సుకోవాలి. తెల్సుకోకుంటే యువరాజ్ కు, దేశానికి ప్రమాదం!" ఆందోళన పడుతూ అన్నాడు సూరి.

ఇద్దరూ హుటాహుటిగా సైనిక విమానాశ్రయం చేరుకున్నారు.

సూరి, ధనార్జనరావులు ఒక సీకింగ్ హెలికాప్టర్లో కూర్చుని సముద్రం గాలించ సాగారు. ఆ హెలికాప్టరు జలాంతర్గాములను విధ్వంసం చేయగలది. జలాంతర్గామి సముద్ర గర్భంలో ఎక్కడున్నా యిట్టే పసిగట్టగల యంత్ర పరికరాలు అందులో ఉన్నవి. హెలికాప్టర్ హోరు పెట్టుకుంటూ సముద్రం మీద తిరుగుతూంది.

మరికొన్ని నౌకలు కూడా రంగంలోకి ఉరికి వున్నై. ఫ్రిగేట్ నౌకలు, క్రూజర్, ఏర్ క్రాఫ్ట్ కారియర్ నౌకలు కూడా హిందూ మహాసముద్రంలో స్వైర విహారం చేస్తున్నవి.

సముద్ర గగన తలమంతా విమాన మోతలతో నౌకల సైరన్లతో హడావిడిగా వుంది.

సూరి, ధనార్జనరావులు అతి జాగ్రత్తగా చూస్తున్నారు. బ్రహ్మాండమైన సముద్రం మీద హెలికాప్టర్ పరుగులు తీస్తూంది.

18

"మిస్టర్ యువరాజ్! మీరు బ్రతికి బయట పడలేరు. మీ కళ్ళెదుటే భారతదేశాన్ని మసి చేసేస్తాం" అని

సగర్వంగా అంటూ అహమ్మద్ ఖాన్ రేడియో రిసీవర్ని ఆన్ చేశాడు.

“ఆ మనిని మీరు ఆక్రమించుకుంటే మీకు గిట్టడానికి గడ్డి వుండదు,” అసహ్యించుకుంటూ యువరాజ్ అన్నాడు.

యువరాజ్‌కు ముచ్చెమటలు పట్టినై. దేవకి ఏం చేస్తూంది? ఆమె అక్కడ ఏమీ చేయలేదు. తనకు లభిస్తే ఆమె సహాయమే లభించాలి. ఆమె సహాయం చేయగలదా? అందుకు శత్రువులు అవకాశం యివ్వగలరా?

అహమ్మద్ ఖాన్ రేడియో రిసీవర్లో వార్తకోసం ఎదురు చూస్తున్నాడు.

ఇక యువరాజ్‌ని ప్రాణాలతో విడువకూడదు. హత మార్చాలి. అందుకు ఆగాఖాన్ పూనుకున్నాడు. పిస్టల్ బయటికి తీశాడు.

బద్దలైన అగ్నిపర్వతంలో పడ్డట్టుగా వుంది. శరీరమంతా వణికిపోతూంది. పిస్తోలు పేల్చబోతున్నాడు. తన జీవితం ఆ సాగర గర్భంలో అంతమొందుతుందని కుమిలిపోయాడు.

యువరాజ్ గట్టిగా కళ్ళుమూసుకున్నాడు.

ఆ సమయంలో రేడియో రిసీవర్ వార్తలను ప్రసారం చేయడం ప్రారంభించింది. ఆ వార్తలు పాకిస్తాన్ సేనలు, బంగ్లాదేశ్‌లో విచక్షణా రహితంగా అమాయక ప్రజలమీద పిల్లలమీద, కాలేజి విద్యార్థినీ విద్యార్థులమీద సాగించు మారణహోమాన్ని గురించినవి.

అందరి చెవులూ నిక్కపొడుచుకున్నై. ఆగాఖాన్ పిస్తోలును పేల్చలేకపోయాడు. వార్తలను వినడంలో దృష్టిని లగ్నపరచాడు. సియాంగ్ కూడా అదేపని చేశాడు.

పాకిస్తాన్ సేనలు పాశవికంగా బంగ్లాదేశ్ ప్రజల మీద శతఘ్నులను, మోర్టారులను, రాకెట్లను' బాంబులను ప్రయోగించడం రేడియో అనౌన్సర్ చెప్తూంటే అందరూ

ఊపిరి బిగబట్టి వింటున్నారు.

లక్షల కొలది బంగ్లాదేశ్ అమాయక ప్రజలు నిహతులైనారు.

ప్రపంచచరిత్ర ఎరుగని పైశాచికాన్ని నియంత యాహ్యాఖాన్ సృష్టించాడు. నిరాధీయులైన బంగ్లాదేశ్ ప్రజలు రొమ్ములు విరిచి నిలబడి పోరాటం ప్రారంభించారు. యాహ్యాఖాన్ సర్వాధికారాన్ని తుడిచి పెట్టడానికి స్వాతంత్ర్య యోధులు షేక్ ముజిబుర్ రెహమాన్ నాయకత్వంలో వెల్లువలా ప్రజా సమూహం పురవళ్ళు త్రొక్కుకుంటూ వెళ్తోంది.

యాహ్యాఖాన్ తన శరీర అవయవాలను తనే నరుక్కుంటున్నాడు.

దేశ చరిత్రలో ఏ నాయకుడూ తమ దేశ ప్రజలమీద మరణాయుధాలను ప్రయోగించినది లేదు...

ఆ జలాంతర్గామిలో యాహ్యాఖాన్ అనుచరులు, ముజిబుర్ రెహమాన్ అనుచరులూ వున్నారు.

బంగ్లాదేశ్‌లో పాక్ సైనికుల దారుణకాండను వింటున్న ముజిబుర్ రెహమాన్ అనుచరులు ఆవేశాన్ని పట్టలేక పోయారు. యాహ్యాఖాన్ని దూషించడం ప్రారంభించారు.

ఆ దూషణలను యాహ్యాఖాన్ అనుచరులు విని వుండలేక పోయారు. వాగ్వివాదం, అల్లరి చెలరేగింది. యాహ్యాఖాన్‌కి, ముజిబూర్‌కు జేజేలంటూ కుమ్ములాటకు దిగిపోయారు.

కోలాహలం, గందరగోళం అయిపోయింది. జలాంతర్గామి దద్దరిల్లి పోతూంది. యువరాజ్ హడలిపోయి అయోమయుడై పోయాడు. వాళ్ళల్లో వారికి కీచులాట ప్రారంభమైంది.

దేశకిని చెయ్యి పట్టుకుని యువరాజ్ అటు వెళ్ళుతున్నాడు. ఆగ్రహావేశాలకు గురైన దేశభక్తులు పిస్తోళ్ళతో పేల్చుకోవడం ప్రారంభించారు. ఎవరు ఎవర్ని చంపుతున్నారో అర్థంకావడంలేదు.

పాక్ సైన్యం చేయు కిరాతకంకంటె మరో ఘాతుకం ప్రపంచంలో వుండదు. బంగ్లాప్రజల అవస్థలు చెప్పనలివి కానివి. అందుకు రౌద్రులైన బంగ్లాదేశ్ వారు తిరగబడ్డారు. కాల్పులు ప్రారంభమైనవి.

అందులోవున్న బాంబులు పేలుతాయేమో యువరాజ్ గడగడ వణికిపోతున్నాడు. చాలామంది మరణిస్తున్నారు. చావుకేకలు అరుపులు గందరగోళంగావుంది.

ఆ సమయంలో జలాంతర్గామి నీటిపైకి తేలడం ప్రారంభించింది.

యువరాజ్, దేవకిలు తమ ప్రాణాలను కాపాడుకోడానికి సతమతమవుతున్నారు.

జలాంతర్గామిలోని సిబ్బందిలో చాలామంది మరణించారు. ఎక్కడ చూచినా రక్తం గడ్డకట్టి పడివుంది. శవాలున్నవి. జలాంతర్గామిలో భీతావహం తాండవమాడింది. దేవకి ఆ శవాలను, రక్తాన్ని చూచి హడలిపోయింది.

"హాండ్సప్!" అని వినబడింది. యువరాజ్ గిరుక్కున తిరిగిచూచాడు. అహమ్మద్ ఖాన్ పిస్తోలుతోనిలబడివున్నాడు.

"ఏమిటీ దారుణం?" ఆవేశం, ఆవేదన మిళితమైన స్వరంతో అడిగాడు యువరాజ్.

జలాంతర్గామి సముద్ర జలాల మీదకు తేలబోతూంది.

"దారుణం కాదు, ధర్మమూ కాదు. రాజనీతి!" చెప్పాడు అహమ్మద్ ఖాన్.

"నీ రాజనీతి పాడుగానూ, ప్రజలను హతమార్చి మట్టినా పరిపాలించబోతారు! పది నిముషాలముందు వరకూ సోదరులుగా వుండిన మీరు ఈ జలాంతర్గామిలో వున్న బంగ్లాదేశ్ వీరులను పొట్టన పెట్టుకున్నారు. దుర్మార్గుడా...మీబోటి కిరాతకులు, పచ్చి నెత్తురు త్రాగు కసాయివాళ్ళు బ్రతుకు ఈ భూమ్మీద బ్రతకడం కంటె చావడంమేలు. చంపు,"

అని వుద్రేకంతో వూగిపోయాడు యువరాజ్. తన ప్రక్క నుండిన దేవకి ఎప్పుడు కనుమరుగైనదో ఆయనకు తెలియదు.

ఇపుడు జలాంతర్గామి పూర్తిగా నీటిమీదకు వచ్చేసింది. పైకి తేలిన జలాంతర్గామిని పసిగట్టిన కొన్ని విమానాలు, హెలికాప్టరు గగన తలంలో చుట్టుముట్టినై. జలాంతర్గామి చుట్టూ మైలుదూరంలో సముద్రజలాలమీద బాంబులను వేయడం ప్రారంభించినై. బాంబులు పడ్డప్పుడు నీరు వుత్తున లేస్తున్నది.

అహమ్మద్ ఖాన్ బాంబుల పేలుళ్ళను చూస్తూ భీతి చెందిపోయాడు. అలా చూస్తూన్నాడు. ఆ అదనులో యువ రాజ్ నీటిలోకి దుమికేశాడు. అహమ్మద్ ఖాన్ తృళ్ళిపడి యువరాజ్ దూకినవైపు పిస్తోలు గురిపెట్టి ఢాం, ఢాం అని పేలుస్తున్నాడు.

నీట మునిగిన యువరాజ్ పైకి తేలకుండా వూపిరి బిగపట్టి శక్తి కొలదీ చేపలా ముందుకెళ్తున్నాడు. పైకి తేలితే అహమ్మద్ ఖాన్ పిస్తోలు పేలుస్తాడని తెల్సు. ఈదుతున్నాడు. భయంగా వుంది. ఏ సముద్ర జంతువైనా తనని పొట్టన పెట్టుకుంటుందేమో! భయంగా వుంది. చాలా దూరం వెళ్ళి పైకి లేచాడు.

ఆశ్చర్యం! హెలికాప్టర్లలో నుండి, విమానాల నుండి పారాట్రూప్ దళాలు సముద్ర జలాలలోకి దిగుతున్నవి. సైనికు లందరూ నేర్పుగా పారాచూట్లను నీటిలో వదిలేసి జలాంతర్గామి వైపు ఈదుతున్నారు. అంతలో ఆ ప్రదేశానికి భారత నౌకాదళానికి చెందిన నౌకలూ చేరుకున్నవి.

యువరాజ్ ఈదుతూ చేతులూపాడు. ఆయనకు తిన్నగా ఒక హెలికాప్టర్ ఆకాశంలో ఆగింది. అందులో నుండి నిచ్చెన దించబడింది.

ఆ హెలికాప్టర్‌లో సూరి, ధనార్జనరావు లున్నారు.

19

జలాంతర్గామిలో దేవకి యురేనియాన్ని చేతికందుకుంది. రాకెట్ ప్రయోగ స్థలంలో కాళికాదేవిలా నిలబడింది. అహమ్మద్ ఖాన్ రాకెట్లను ప్రయోగించడానికి అయత్తుడై వచ్చాడు.

"అడుగు ముందుకు వేశావా... ఈ యురేనియం కలుపుతాను. భస్మమై పోతాము." అని హుంకరించింది. ఆమె కోపాన్ని చూచిన అహమ్మద్ ఖాన్ అడుగు ముందుకు వేయలేకపోయాడు. ఆమె అన్నంత పనీ చేసేటట్టుంది. నివ్వెరపోయాడు.

"కలుపు. కలిపావంటే నీ భర్త తయారుచేసిన బాంబులన్నీ పేలిపోతాయి" అంటూ ముందుకు వచ్చాడు.

దేవకి వళ్ళు జలదరించి పోయింది. భయపడ్డట్టు నటించింది. అహమ్మద్ దగ్గరయ్యాడు.

యురేనియం ఒక ముద్దను ఆతని ముఖం మీదకు విసిరింది. మాంచి దెబ్బ తగిలింది. ఇంకో ముద్దనూ విసిరింది. అహమ్మద్ ఖాన్ తల పగిలింది. క్రిందపడ్డాడు బాధను తట్టుకోలేక.

అంత బాధ పడుతూనే అహమ్మద్ ఖాన్ యురేనియం ముద్దలను అందుకుని, కలపబోతున్నాడు.

అతని ఘాతుకానికి దేవకి నిలువెల్లా వణికి పోయింది. విరుచుకు అతనిమీద పడిపోయింది. అహమ్మద్ ఖాన్ యురేనియాన్ని కలపకుండా చేయడానికి రక్కింది. తన్నింది. కొరికింది.

ఆ సమయంలో భారత సేన చుట్టు ముట్టేసింది.

20

"బాంబులన్నిటినీ సురక్షితంగా మన సైన్యం వశపరచుకుంది. జలాంతర్గామిని, రాకెట్లను కూడా స్వాధీన పరచుకుంది," చెప్పాడు ధనార్జనరావు.

దేవకి, భుజంగరావు పాదాలమీద పడిపోయి విషాదంగా

రోదిస్తూ, "నన్ను క్షమించండి. నే నిక నీతిబాహ్యమైన పనిని ఎన్నటికీ చేయను" ప్రాధేయపూర్వకంగా అడుగుతూంది.

"దేవకీ! ఏడ్వకు. తప్పు తెల్సుకున్నవారు జ్ఞానులవుతారట. పిచ్చిదానా. నీ స్వభావం నాకు బాగా తెల్సు. మనిషికి తన మనసుని అదుపాజ్ఞలో వుంచడం సులభతరమైన పనికాదు," అంటూ ధైర్యమిచ్చాడు భుజంగరావు.

భుజంగరావు విశాల హృదయానికి అక్కడున్న యువరాజ్, సూరి, ఐ. జి, కమీషనర్ ఆఫ్ పోలీస్, హోంమంత్రి తదితర వున్నతాధికారులు గర్వపడ్డారు.

"మిస్టర్ భుజంగరావ్! అణ్వస్త్రాలు అశాంతికి మూలమని మానవకులం తెలుస్తూంది. మీ రెందుకు తయారుచేశారు?" అడిగాడు హోంమంత్రి.

"చాలా దేశాలు అణ్వస్త్రాలను తయారు చేసుకుని వున్నై. మనకు తప్పని సరివుండాలి. లేనిచో బీదదేశమని, సాంకేతిక రంగంలో వెనుకబడ్డ దేశమని ఎంచబడుతుంది. నా మాతృదేశం అలా వుండకూడదని నిర్మించాను," చెప్పాడు భుజంగరావు.

"మీ దేశభక్తి అపారమైనది. మిమ్మల గురించి కేంద్ర ప్రభుత్వానికి తెలియచేశాను," అన్నాడు రాష్ట్ర హోంమంత్రి.

"శత్రువులను మట్టుపెట్టిన యువరాజుకు నాజోహార్లు" అన్నాడు ఐ. జి.

"నాకుకాదు దేవకికి జోహార్లు అర్పించాలి. ఆమె సమయస్ఫూర్తి, ధైర్యం, సాహసం లేకుండా వుండి వున్నట్లయితే నేను, శత్రువులు, బాంబులు మీకు అంది వుండే వాళ్ళము కాదు"

అంటూ జరిగిన విషయాలు చెప్పాడు యువరాజ్.

—: అయిపోయింది :—